# రెనగేడ్ సవ్యసాచి పండా పాలకవర్గాలతో గొంతు కలిపి మావోయిస్టు పార్టీపైన, విప్లవోద్యమం పైన చేస్తున్న విషపూరిత, నిరాధార, తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టండి!

# పండా ముందుకు తెచ్చిన మితవాద అవకాశవాద ఆధునిక రివిజనిస్టు పంథా అసలు సారాన్ని ప్రజల్లో బహిర్గతం చేయండి!

మా పార్టీ ఒడిశా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీకి సెక్రటరీగా పనిచేసిన సవ్యసాచి పండా, జనవరి 2012లో రాష్ట్ర ప్రత్యేక ప్లీనం జరిగిన తర్వాత నుండి పార్టీని కాంటాక్టు చేయకుండా తాను రూపొందించుకున్న ముందస్తు ప్లాన్ ప్రకారం పార్టీకి విరుద్ధంగా పార్టీ వ్యతిరేక కుట్రపూరిత విచ్ఛిన్నకర కార్యకలాపాలను ముమ్మరం చేశాడు. కేంద్రకమిటీ నుండి ఒడిశా రాష్ట్ర బాధ్యతలు చూస్తున్న సిసిఎం ఒకరు పండాను కాంటాక్టు చేసేందుకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన ఉద్దేశపూర్వకంగానే కలియ నిరాకరించాడు. ఎస్ఓసి కార్యదర్శి పేరుతో క్రమశిక్షణా రాహిత్యంగానే గాకుండా పార్టీ పాలసీకి భిన్నంగానూ పత్రికలకు, మీడియాకు ప్రకటనలు, ఇంటర్వ్యూలు ఇచ్చాడు. ఏఓబి, సిఓబి కార్యకలాపాలపై బహిరంగంగా విమర్శలకు దిగాడు. ఎంఎల్ఏ జగబంధు మాజీని బందీగా పట్టుకోవడం, నరహంతకుడైన మతోన్మాది లక్షణానందను చంపడం తప్పనీ, మల్కన్‌గిరిలో ఎస్ఐని చంపడంపై స్పందిస్తూ వ్యక్తులను చంపడం పార్టీలో ఫ్యాషన్‌గా మారిందనీ, పార్టీలో రాజకీయాలది కాకుండా, తుపాకి ఆధిపత్యం నడుస్తోందని దుష్ప్రచారానికి పూనుకున్నాడు. తన నాయకత్వంలో ఇటలీ పర్యాటకులను బందీగా పట్టుకున్న సందర్భంలో పండా బరితెగించి పచ్చి అవకాశవాద పద్ధతులకు పాల్పడ్డాడు. మొత్తం ఒడిశా రాష్ట్రానికంతా ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించాడు. లక్ష్మీపూర్ ఎంఎల్ఏను ఏఓబి కామ్రేడ్స్ బందీగా పట్టుకొనడం సిసి నిర్ణయానికి విరుద్ధమైందని, అతనిని వదిలిపెట్టాలని ప్రకటించాడు. విచ్ఛిన్నకర, అవకాశవాద కార్యకలాపాలను శత్రువు ఉపయోగించుకొని పార్టీలో అంతర్గత ఘర్షణలున్నాయనీ, గ్రూపులున్నాయనీ, క్రమశిక్షణా రాహిత్యం ఉందనీ ప్రచారం చేశాడు.

పండా బాసధార–ఘుమ్సర ఉమ్మడి డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ నిఖిల్ అభిప్రాయాలతో సంబంధం లేకుండానే అతని పేరుతో విప్లవ వ్యతిరేక ప్రకటనలు చేశాడు. వేర్వేరు సామాజిక సముదాయాల నుండి, వేర్వేరు రాష్ట్రాల నుండి వచ్చి ఒడిశాలో పనిచేస్తున్న కామ్రేడ్స్ మధ్య విభేదాల్ని సృష్టించేందుకు ఒక విషపూరిత క్యాంపెయిన్ను కొనసాగించాడు. ఒడిశా పార్టీలో కోయ, తెలుగు వారు స్థానిక కుప్పీలపై ఆధిపత్యం వహిస్తున్నారనీ, అందువల్ల కోయ, తెలుగు వారికి ప్రజలెవరూ తిండి పెట్టవద్దనీ, సహకరించవద్దని గ్రామాల్లోని ప్రజాసంఘాల నాయకులకు పార్టీ పేరుతో ఉత్తర్వులు జారీ చేసి గందరగోళాన్ని సృష్టించాడు. అందువల్లనే పండా పార్టీని వీడి వెళ్లిపోతాడనీ, కొత్త గ్రూపును ఏర్పరుస్తాడనీ మీడియాలో వరుసగా కథనాలు వెలువడుతుంటే వాటిని ఖండించక నోరు మెదపకుండా ఊరుకున్నాడు. పండా అనుసరించిన ఈ విధానాలన్నీ పార్టీలో రాజకీయ, నిర్మాణపరమైన సమస్యల్ని సృష్టించి ఒడిశా ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఏఓబి ఎస్జడ్సి సభ్యులు కామ్రేడ్స్ అప్పారావు, సురేష్లు కంధమాల్లో ప్లాటూన్ సంఖ్యలో తిరుగుతూ తనని చంపడానికి చూస్తున్నారనే యుక్తితో ప్రచారాన్ని క్యాడర్లలో ఉద్దేశ్యపూర్వకంగా చేస్తూ భయాందోళనల్ని రేకెత్తించాడు. దీన్ని సాకుగా చూపి పార్టీ నుంచి వేరవ్వాలనే తన దుష్ట పథకానికి పార్టీలో మద్దతు కూడగట్టడానికి కుట్రపూరితంగా మోటివేట్ చేశాడు. అంతేకాకుండా మేధావుల సానుభూతి సంపాదించుకోచూడడంతో పాటు పార్టీపై టెర్రరిస్టు ముద్ర వేయాలని ప్రయత్నించాడు.

చివరికి పండా విచ్ఛిన్న కార్యకలాపాలు, క్రమశిక్షణా రాహిత్యం ఏ స్థాయికి చేరాయంటే కామ్రేడ్ నిఖిల్ బాసధార–ఘుమ్సర ఉమ్మడి డివిజన్ కమిటీకి కార్యదర్శిగా కొనసాగుతుండగానే తాను ఏ కమిటీలో చర్చించకుండానే ప్రదీప్ నాయకత్వంలో పోటీ కమిటీని నెలకొల్పాడు. ప్రదీప్ పేరుతో రకరకాలుగా ప్రకటనలు చేస్తూ పార్టీపై దుష్ప్రచారాన్ని కొనసాగించాడు. 'బయటి నుండి వచ్చినవాళ్లే నాయకత్వంలో ఉన్నారనీ, సిసి స్థానికులను నాయకత్వంలోకి తీసుకోలేదనీ బయట నుండి వచ్చినవారి వల్లే ఉద్యమం నష్టపోయిందనీ, నిఖిల్ పార్టీ నుండి వెళ్లిపోయాడనీ, పార్టీ క్రిస్టియన్లపై దాడికి పథకం రూపొందించిందనీ' దుష్ప్రచారం చేయించాడు. ఈ క్రమంలోనే పండా సహచరి మిల్లీ పండా ఇచ్చిన ఇంటర్వ్యూలో పండా సాయుధ పోరాటాన్ని వదిలి ప్రజా ఉద్యమం నడపడానికి సిద్ధంగా ఉన్నాడని ప్రకటించడం ద్వారా పండా ప్రయాణం ఎటువైపనేది అందరికీ స్పష్టమయింది.

1-6-2012న పార్టీ పంథాపైనా, ఫంక్షనింగ్పైనా నీతిమాలిన నిందల, అబద్ధాల ప్రచారంతోనూ, గుడ్డి ద్వేషంతోనూ దాడి చేస్తూ రెండు ఉత్తరాలు రాశాడు. అందులో ఒకటి తన అభిప్రాయాల సంక్షిప్త పాఠంగా జైలులో ఉన్న, బయట ఉన్న కామ్రేడ్స్కు రాశాడు. 40 పేజీలు ఉన్న మరో ఉత్తరం కామ్రేడ్స్ జి.ఎస్., విజయ్ దాదా, సుమిత్ దాదాలను సంబోధిస్తూ రాశాడు. ఇందులో అతను నిజాయితీ లేకుండా ఎన్నో ఆరోపణలు చేశాడు. చిలవలు పలవలు

చేర్చి తన కల్పనా చాతుర్యాన్నంతా ప్రదర్శించాడు. చివరికి పార్టీ నుండి వైదొలగినట్లుగా ప్రకటిస్తూ తన ఉత్తరాలను మీడియాకు కూడ పంపాడు.

ఇక ఈ ఉత్తరాలలో ముఖ్య సారంగా 'మహాశయుడు' ఉద్ఘాటించిన విషయాలను, విప్లవాన్ని కాంక్షించే వారందరూ తెలుసుకోవలసినదే. ఎందుకంటే, ఆ వాదనలు విప్లవం ముసుగులో వెలువడ్డ మోసపూరిత అడ్డగోలు వాదనలు కాబట్టి. ఆయన ఉద్ఘాటనల్లో ముఖ్యమైనవి – ప్రజలు సాయుధ పోరాటానికి సిద్ధంగా లేరనీ, ప్రజలు సంస్కరణలపై, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై భ్రమలతో ఉన్నారనీ, రాజ్యం అత్యంత కేంద్రీకృతంగా, బలసంపన్నంగా ఉంది కనుక సాయుధ పోరాటం, గెరిల్లా జోన్లు, విముక్తి ప్రాంతాలు నిర్మించే కర్తవ్యాలను పెట్టుకోవడం స్వీయాత్మకతతో కూడిన ఒంటెత్తుపోకడనీ, పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం పేరుతో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారనీ, అంతటితో ఆగకుండా ఈ 'చరిత్ర విశ్లేషకుడు' రష్యా, చైనాలలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం, కార్మికవర్గ నియంతృత్వాల పేరుతో పార్టీలోనూ, సమాజంలోనూ, ప్రజాస్వామ్యం గొంతు నులిమి రాజకీయ ప్రత్యర్థులను అణగదొక్కటం, నిర్మూలించడం మూలానే సోషలిస్టు నిర్మాణాలు దెబ్బతిన్నాయనీ, ఇది స్టాలినిస్టు పద్ధతి అని తన ఉత్తరాలలో రాశాడు. ఇంకా అతని నీచ స్వభావానికి అద్దం పట్టే విషయమేమిటంటే, పార్టీలో విప్లవ హింస పేరుతో పార్టీ కార్యకర్తలను సైతం చంపే బర్బర హింస కొనసాగుతున్నదనే అబద్ధాన్ని నిర్లజ్జగా రాశాడు. ఇంకా అన్నింటికంటే ఆశ్చర్యమైన విషయమేమంటే, తల, టోపీల మధ్య సంబంధాన్ని విప్లవం, పార్టీ మధ్య సంబంధంతో పోల్చాడు. ఈ పోలిక చెప్పటంలో ఆ 'మార్క్సిస్టు మహా పండితుడి' ఆంతర్యం ఏమిటంటే, తలకు టోపీ అవసరం ఉన్నట్లుగానే విప్లవానికి పార్టీ అవసరం ఉంటుందనీ, అయితే అది ఒక సంఘటిత రూపంగా లేకుండా కేవలం ప్రచారానికే పరిమితమై స్వేచ్ఛ, స్వచ్ఛత అంటూ గావుకేకలు పెట్టే అరాచక, బిగిలేని, ఉదారవాద గ్రూపుగా ఉండాలనేదే ఆయన అభిమతం. ఇక చివరిగా చైనా విప్లవ మార్గమైన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గం భారతదేశానికి వర్తించదనే సత్యాన్ని ఆవిష్కరించి 'కొండను తవ్వి ఎలకను కూడ పట్టలేకపోయాడు'. పైగా ప్రజలలో స్తబ్దత ఏర్పడిందనే పేరుతో, కేంద్రీకృతమైన రాజ్యాంగ యంత్రం పేరుతో ప్రత్యామ్నాయ పరిష్కారంగా విప్లవ సన్నాహాల ముసుగులో విప్లవాన్ని అనంతకాల భవిష్యత్తుకు వాయిదా వేయాలని ప్రయత్నించాడు.

ఇంత మహత్తరమైన ఆలోచనలు ఉన్న పండా ఒక నెల తక్కువ 13 సంవత్సరాలు మావోయిస్టు పార్టీలో ముఖ్యమైన బాధ్యతలలో కొనసాగడం అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం. ఇటువంటి ద్రోహులు సాధారణంగా విప్లవంలో అనుకూల పరిస్థితులు కొనసాగుతున్నప్పుడు తమ అభిప్రాయాలను ఏ వేదికలోనూ వ్యక్తపరచకుండా, అత్యంత గోప్యంగా ఉంటూ పార్టీ ప్రతిష్టను తమకే ఆపాదించుకొని, పార్టీలో తమ స్థానాన్ని ఉపయోగించుకొని

సొంత ప్రయోజనాలను నెరవేర్చుకొంటూ ఉంటారు. పార్టీ నాయకత్వంలో, ప్రజల సహకారంతో పిఎల్‌జిఏ యోధులు అత్యంత త్యాగపూరితంగా, వీరోచితంగా నిర్వహించిన నయాగడ మల్టీరెయిడ్ సంఘటనలో పండా పాత్ర స్వల్పమే అయినా, ఆయనను 'ఒడిశా చేగువేరా' అంటూ మీడియో అతిశయోక్తులతో చేసిన ప్రచారాన్ని అల్పబుద్ధి గల పండా బాగానే ఆస్వాదించాడు. ఈ సంఘటన కలిగించిన ఉత్తేజంతో ఒడిశా పీడిత ప్రజానీకం వ్యక్తపరిచిన విశ్వాసాన్ని, గౌరవాన్ని మొత్తం పార్టీతో పాటు 'పచ్చగడ్డిలో పాము' లాంటి రివిజనిస్టు పండా కూడ పొందాడు. అయితే ఇటువంటి అవకాశవాదులంతా చరిత్రలో, ఆయా సందర్భాలలో కార్మికవర్గ పార్టీలు శత్రువుతో తీవ్రమైన పోరాటంలో ఉన్నప్పుడూ, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లలేక, అత్యంత హేయంగా, నీచంగా దోపిడివర్గాల ప్రయోజనాలను వకాల్తా పుచ్చుకొని, కార్మికవర్గ, పీడిత ప్రజల ప్రయోజనాలపై దాడి చేస్తూ విప్లవ ద్రోహులుగా మారారు. రెండవ ఇంటర్నేషనల్‌లోని కాట్స్కీ మొదలుకొని మన దేశంలో కానూ సన్యాల్, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, సత్యనారాయణ సింగ్, పైలా వాసుదేవరావు తదితర అవకాశవాద నాయకులంతా ఈ కోవకు చెందినవారే. ప్రస్తుతం ఈ అవకాశవాదుల వారసుడుగా పండా మొద్దుబారిన రివిజనిస్టు కత్తితో మా పార్టీపైన, విప్లవోద్యమంపైన, ప్రజలపైన నీచమైన దాడికి దిగాడు. వాస్తవంగా నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒడిశాలో కూడ వేలాది సాయుధ బలగాలను దింపి అత్యంత అమానవీయంగా, క్రూరంగా పార్టీపైన, పిఎల్‌జిఏపైన, విప్లవ ప్రజానీకంపైన గ్రీన్ హంట్ సైనిక దాడిని మునుపెన్నడూ లేని స్థాయిలో తీవ్రతరం చేస్తున్నాయి. ఈ దాడి వల్ల ఉత్పన్నమవుతున్న నిర్దిష్ట సమస్యలను పరిష్కరించుకొని విప్లవోద్యమాన్ని పురోగమింపజేసేందుకు పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ, మిలీషియా, ప్రజా రాజ్య కమిటీలు, ప్రజాసంఘాలు, ప్రజలు శత్రువుతో సాహసోపేతమైన, నిర్దాక్షిణ్యమైన పోరాటానికి సిద్ధపడుతుంటే, అందుకు అవసరమైన విప్లవ కృషిని, పార్టీ నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా కొనసాగిస్తుంటే, పండా మాత్రం వైరి బలగాలను చూసి రథాన్ని వెనక్కు మలిపిన ఉత్తర కుమారుడిలా సిగ్గులేక యుద్ధరంగాన్నీ, ప్రజలను వదిలి దోపిడీ వర్గాలను శరణు వేడుకొంటున్నాడు. చివరికి ఈ దేశ దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య పాలకవర్గాలను సంతృప్తిపరిచేందుకు నేరపూరిత స్వభావంతో పార్టీని, పిఎల్‌జిఏను నిరాయుధం చేసే కుట్రతో ఒక పథకం ప్రకారం 50 ఆయుధాలను, సుమారు కోటి రూపాయల పార్టీ నిధులను తీసుకొని అవతలపడ్డాడు. దోపిడీ వర్గాలకు మరింతగా సేవ చేసి 'పునీతుడయ్యేందుకు' ముందుగా భార్యను ఎన్నికల బరిలోకి దింపి, పాలకవర్గాలకు తన రాజకీయ లొంగుబాటు సంకేతాలు కూడ పంపించాడు.

ఇకపోతే తన ఉత్తరాలలో మా పార్టీ పంథాతో విభేదిస్తూ రాసిన అసంబద్ధ వాదనలూ, విప్లవం అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ వ్యూహం, ఎత్తుగడలు పేరుతో ముందుకు తెచ్చిన

సంస్కరణవాద, మితవాద అవకాశవాద, గందరగోళ కార్యక్రమాన్ని గతంలో అనేక మితవాద పార్టీలు, వాటి నాయకులు ముందుకు తెచ్చినవే. మా పార్టీ ఆ వాదనలన్నింటినీ పూర్వపక్షం చేస్తూ రివిజనిజం స్థానంలో మార్క్సిజాన్ని సమున్నతంగా నిలబెడుతూ వస్తున్నది. ఆచరణలో సైతం ఆ పార్టీలూ, వాటి నాయకులు నిష్క్రియాపరత్వానికి గురికావటమో, పార్లమెంటరీ పంథాలో దోపిడీవర్గాలకు సేవ చేసేవారిగా మిగలటమో జరిగింది. మా పార్టీ మాత్రం అనేక కష్ట నష్టాలనూ, తిరోగమనాలనూ అధిగమిస్తూ ప్రజాయుద్ధాన్ని పురోగమింప చేస్తున్నది. ఈ విషయాన్ని పండా ఉద్దేశపూర్వకంగానే మరుగుపరచినప్పటికీ, ఈ దేశ దోపిడీ పాలకవర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలతో పాటు వారి యజమానులైన సామ్రాజ్యవాదులు మాత్రం  గుర్తించారు. అందుకే మా పార్టీ నాయకత్వంలో నిర్వహించబడుతున్న ప్రజాయుద్ధం వారి అధికారాన్ని సవాలు చేసే ప్రధాన సమస్యగా మారడంతో ప్రభుత్వం మా పార్టీపైన, ప్రజాయుద్ధంపైన సంపూర్ణ దాడి (ఆల్అవుట్ వార్)ని ప్రారంభించింది.

అయితే పార్టీలో అన్యవర్గ ధోరణుల ప్రభావంతో కొన్ని తప్పులు జరుగుతున్నాయి. బలహీనతలు వ్యక్తమవుతున్నాయి. ఈ తప్పులనూ, బలహీనతలనూ వర్గపోరాటంలో భాగంగానే విమర్శ, స్వయం విమర్శ ద్వారా, దిద్దుబాటు ఉద్యమాల ద్వారా, తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడడం ద్వారా సరిదిద్దుకుంటున్నాం. ఈ ప్రక్రియల ద్వారా పార్టీని కార్మికవర్గ క్రమశిక్షణ, బోల్షివిక్ శైలిని కలిగిన కార్మికవర్గ అగ్రగామిగా సంఘటితపరుస్తున్నాం. ఈ అభివృద్ధి ప్రక్రియలో స్వార్థపూరితమైన పెటీబూర్జువా లక్షణాలు కలిగిన పండా ఇమడలేకపోయాడు. జనవరి 2012లో జరిగిన ఒడిశా రాష్ట్ర ప్రత్యేక ప్లీనంలో కేడర్ నుండి అతనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలను పండా ఏ మాత్రం జీర్ణించుకోలేకపోయాడు. దీనికి తోడు శత్రువు విప్లవ ప్రతిఘాతక దాడి తీవ్రతరం చేశాడు. ఈ పరిస్థితులలోనే అప్పటి దాక కప్పుకొని ఉన్న విప్లవ ముసుగును ఈ అవకాశవాది చించివేసుకొని బయటకి రాకతప్పలేదు. దీని ఫలితంగానే పార్టీ పంథా పైనా, ఎత్తుగడల పైనా, పని విధానంపైనా కుట్రపూరితంగా, అరాచకంగా, దాడి చేస్తూ పండా రాసిన ఉత్తరాలు బూర్జువా మీడియాలో వెలువడ్డాయి. ఈ పరిస్థితులలోనే జూలై 16, 2012న మా కేంద్రకమిటీ తరఫున పండాను విప్లవ ద్రోహిగా ప్రకటించి పార్టీ నుండి బహిష్కరిస్తూ మీడియాకు ప్రకటన పంపడం జరిగింది.

ఇకపోతే పండా మా పార్టీపైనా, నాయకత్వంపైనా, ఉద్యమంపైనా చేసిన విమర్శలలో అధిక భాగం చిల్లర స్వభావం కలిగినవే. ఆ విమర్శలు అతని పెటీబూర్జువా సంకుచితత్వాన్ని, అతని కయ్యాలమారి స్వభావాన్ని తెలియజేస్తున్నాయి. అతడొక నిర్లజ్జాపూరిత అబద్ధాలకోరుగానూ, అల్పబుద్ధి కలిగినవాడిగానూ బహిర్గతపరుస్తున్నాయి. కనుక వాటన్నింటికి ఇక్కడ సమాధానం అవసరం లేదనుకుంటున్నాం. అయితే అతను సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ విషయాలలో లేవనెత్తిన మితవాద అవకాశవాద భావనలకు, ఘోరమైన అబద్ధాలకు సమాధానం

చెప్పాలనుకుంటున్నాం.

## 1. 'చైనాలో లాగ దీర్ఘకాలిక ప్రజాయుద్ధం భారతదేశానికి ఉపయోగపడదు, నేడు దేశంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలు యుద్ధానికి సిద్ధంగా లేరు' అనే విమర్శపై

ప్రజల విప్లవ సంసిద్ధత, నేటి విప్లవ పరిస్థితులు, విప్లవ మౌలిక పంథా పట్ల, ఉద్యమ సమస్యల పట్ల పండా అంచనాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

"నేడు ప్రజలు తమ సమస్యలకు సులభ పరిష్కారాలుగా ప్రభుత్వ సంస్కరణల్ని గానీ, లేదా మన మిలిటెంట్ ఆర్థికవాదాన్ని గానీ ఆశ్రయిస్తూ, ఆ మేరకు పాక్షికంగానే మనతో ఐక్యం అవుతున్నారు తప్ప దీర్ఘకాలిక యుద్ధానికి తయారుగా లేరు. కనుక ప్రజలను సిద్ధం చేయడానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల ఇంత పెద్ద దేశంలో 1-2 చిన్న ప్రాంతాలలో మనం యుద్ధాన్ని తీవ్రతరం చేయకూడదు. ఇలా చేస్తే యుద్ధం-నిర్బంధం తీవ్రతరమైన సందర్భంలో మనం ప్రజల్ని ఆర్గనైజ్ చేయడం కష్టం. ప్రజలు మన స్వీయాత్మక కోర్కెలకు అనుగుణంగా రాత్రికి రాత్రే యుద్ధానికి తయారు కారు.

"మన దేశ భౌతిక స్థితి - కేంద్రీకృత ప్రభుత్వ యంత్రాంగం, బలమైన సైన్యం, ఆధునిక సమాచార వ్యవస్థ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వం వెల్లువలా కుమ్మరిస్తున్న సంస్కరణలు వగైరాలన్నింటి రీత్యా చైనాతో పోల్చితే భిన్నమైనది. 1857 తర్వాత బ్రిటిష్ వాళ్లు భారత గ్రామీణ నిర్మాణాన్ని పంచాయితీ వ్యవస్థ ద్వారా సూక్ష్మంగా మార్చివేశారు. నేడది భారత పాలకుల ద్వారా స్థూలంగా పెంపొందించబడి, సంస్కరణల్ని అమలు చేయడంలో ఒక ముఖ్య సాధనంగా ఉంటూ ప్రభుత్వ విజయానికి ప్రధాన కారణం అవుతున్నది. నారాయణపట్నాలో జరిగిన విధంగా ప్రజలు నేడు దీనిపై భ్రమల్ని కలిగి ఉన్నారు.

"మన నిర్మాణ రూపాలు, పోరాట రూపాలు నిర్దిష్ట పరిస్థితులతో పొసగక ప్రజలు తగినంతగా భాగస్వాములు కావడం లేదు. ఒక ప్రాంతంలో 1-2 ఆర్‌పిసి నిర్మాణాల ఏర్పాటు ద్వారా పరిస్థితిలో మార్పు రాదు. నారాయణపట్నాలో ఇది మనం చేసినప్పటికీ ప్రజలు తమ దారిలో తాము పంచాయితీ ఎన్నికలలో పాలు పంచుకున్నారు. మన దేశంలో విప్లవానికి - ఆర్‌పిసికి గానీ, స్థావర ప్రాంతానికి గానీ ఒక వెల్లువ లాంటి పరిస్థితి ఉండాలి, కనీసంగా ఒక ప్రాంతంలోనయినా.

"ప్రతి ఒక్కరూ మొబైల్స్‌ను చేతిలో పట్టుకుంటున్న పరిస్థితుల్లో, ఎలక్ట్రానిక్ మాధ్యమం ప్రభావం విస్తృత వ్యాప్తి చెందిన స్థితిలో దాన్నంతా సామ్రాజ్యవాద సంస్కృతి అనే పాత సిద్ధాంతం ద్వారా కొట్టి పారేయలేం. యుద్ధ తయారీలు, మన శక్తి బలహీనంగా ఉన్న స్థితిలో విప్లవ శక్తులకు వెనకతట్టు లేకుండా డికె-బిజెలను విముక్తి ప్రాంతాలుగా నిర్మించాలనే మన నిర్ణయం

అతివాద దుస్సాహసిక స్వభావంతో కూడినది. ప్రజల స్థితి, చైతన్యంతో సంబంధం లేకుండా ప్రతి చోటా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలనే పార్టీ విధానంలోనే లోపం ఉంది.

"పాత ఉద్యమ ప్రాంతాలను ఒకదాని తర్వాత ఒకటిగా వరుసగా ఖాళీ చేస్తూ తరచూ కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ మూసపోత సెక్టేరియన్ విధానాలను నిరాటంకంగా అమలు చేస్తున్నాం. ముఖ్యంగా సాయుధ పోరాట ప్రాంతాలలో నాయకత్వం యొక్క స్వీయాత్మకత నుంచి ఒంటెత్తు సిద్ధాంతాలను ముందుకు తెస్తున్నాం. ఏపిలో శత్రువు చేత ఎదురు దెబ్బలు తిన్నప్పటికీ ఆధిక్యతా భావం మూలంగా చారిత్రక తప్పిదాల నుంచి ఏమీ నేర్చుకోవడం లేదు.

"మొత్తంగా వెరసి చైనాలో లాగ దీర్ఘకాలిక ప్రజాయుద్ధం భారతదేశానికి ఉపయోగపడదు. నేడు దేశంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలు యుద్ధానికి సిద్ధంగా లేరు. కాబట్టి శత్రువుకు బహిర్గతం కాకుండా పార్టీ, సైన్యం రహస్యంగా ఉంటూనే సార్వత్రిక తిరుగుబాటు పద్ధతిలో మన తయారీలన్నీ ఎక్కువ తక్కువలో తప్పనిసరిగా రహస్యంగానే పూర్తి కావాలి. బహిరంగంగా ప్రజాసంఘాలకు కూడా ఇదే వరిస్తుంది. ప్రజాసంఘాలకు ఎంఎల్ఎం సిద్ధాంతాన్ని పెట్టడం, దానికి అనుగుణంగా ఓట్ల బహిష్కరణ కార్యక్రమాన్ని ఇవ్వటం, పెద్ద బహిరంగ సభల ద్వారా అందరినీ బహిర్గతం చేసుకోవటం, శత్రువుకు టార్గెట్ కావటం – ఇదంతా పరిస్థితి పట్ల గత స్వీయాత్మక అంచనాల ఫలితంగానే జరుగుతున్నది."

ఇదీ సారాంశంలో పండా గారి దివాలాకోరు అవగాహన.

దీన్ని చదివిన వారెవరైనా నేటి ఉద్యమ స్థితి పట్ల, ప్రజల పట్ల, పోరాటం పట్ల, ప్రజాయుద్ధం పట్ల, నూతన ప్రజాస్వామిక విప్లవం పట్ల పండాకు నమ్మకం ఉందని ఏ కోశాన అనుకోలేరు. విప్లవం నల్లేరు మీద బండి నడకలా, కడుపులో చల్ల కదలకుండా కొనసాగించేదిగా ఎక్కడా, ఎప్పుడూ, ఎన్నడూ ఉండదు. కాని పండా అలా ఉండాలనుకుంటున్నాడు. కష్టకాలం ఎదురయ్యేటప్పటికి ఆయనకు కాలం చెల్లిన సిద్ధాంతాలు గుర్తుకొస్తున్నాయి. ఇదంతా తోక పీకుడు సిద్ధాంతం లేదా పలాయనవాదం తప్ప మరేమీ కాదని బల్లగుద్ది చెప్పవచ్చు.

గతితార్కిక చారిత్రక భౌతికవాద పద్ధతిని అనుసరించి భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, భౌగోళిక నిర్దిష్ట పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, వర్గాలు, వర్గ సంబంధాలు, వర్గ వైరుధ్యాలను కనుక్కొని, వాటిలో ప్రముఖ, మౌలిక, ప్రధాన, యితర వైరుధ్యాల మధ్య తేడాను దృష్టిలో ఉంచుకుంటూ ప్రధాన వైరుధ్య పరిష్కారానికి తద్వారా యితర వైరుధ్యాల పరిష్కారానికి దారి సుగమం చేయడానికి పార్టీ కృషి చేస్తున్నది. మా పార్టీ భారతదేశ నిర్దిష్ట స్వాభావిక లక్షణాల్ని – స్వపక్షం, శత్రు పక్షం యొక్క బలమూ, బలహీనతల్ని సరిగా విశ్లేషించి భారత విప్లవ వ్యూహాన్ని దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాగా నిర్వచించింది. ఈ మార్గంలోనే నక్సల్బరీల నాటి నుంచీ నాలుగు దశాబ్దాలకు పైగా భారత విప్లవోద్యమం అనేక ఎగుడు

దిగుళ్ల మధ్య రక్తాన్ని చిందిస్తూ త్యాగాల బాటలో అభివృద్ధి చెందుతూ వస్తున్నది. మార్క్సిజం–లెనినిజం–మావోయిజం వెలుగులో సామ్రాజ్యవాద యుగ స్వభావం గురించీ, భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో కార్మికవర్గం, రైతాంగం తదితర పీడిత వర్గాల చారిత్రక పాత్ర గురించీ, ప్రపంచ సోషలిస్టు మహా విప్లవంలో ఒక విడదీయరాని భాగంగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవం గురించీ, సామ్రాజ్యవాద యుగంలో మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల కార్మికవర్గం, పీడిత ప్రజలు నిర్వహించే చారిత్రక పాత్ర గురించీ మన పార్టీకి సరైన అవగాహన ఉంది. ఇలాంటి సరైన అవగాహన లేని వాడెవడూ విప్లవకారుడు కాడు – పచ్చి రివిజనిస్టు. కార్యాచరణలోని ఓటములు, విజయాలు పురోగమన, తిరోగమనాల్ని ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యల్ని నిబంధనావళి ప్రకారం కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రానికి అనుగుణంగా చర్చించుకుంటూ, గుణపాఠాలను తీస్తూ, రాజకీయ–సైనిక పంథాను, పాలసీలను, ఎత్తుగడలను కూడా మరింతగా పరిపుష్టం చేసుకుంటూ ముందుకు వెళుతున్నది.

ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొనే మా పార్టీ 'భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు' డాక్యుమెంట్‌లో ఒక అంశంగానే దీన్ని ప్రత్యేకించి ప్రస్తావించింది.

"భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి ఎక్కువగా ఉంది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలున్నాయి. మెరుగైన రవాణా, కమ్యూనికేషన్ సదుపాయాలున్నాయి. విప్లవ పూర్వ చైనాతో పోల్చినప్పుడు భారత ప్రభుత్వానికి చాలా పెద్దది అయిన ఆధునిక సైన్యం, ఒక బలమైన కేంద్రీకృత వ్యవస్థ ఉన్నాయనే కారణాలు చూపుతూ కొందరు విముక్తి ప్రాంతాలను నెలకొల్పడమూ, ఎర్రసైనాన్ని నిర్మించడమూ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని నడపడమూ అసాధ్యమని వాదిస్తారు. ఈ వాదనలు తప్పు. నేడు శత్రు సైనిక శక్తి ఎంత బలమైంది అయినప్పటికీ, ప్రజా సైనిక శక్తి ఎంత బలహీనమైంది అయినప్పటికీ శత్రువుకు బలహీన స్థానమైన విశాల గ్రామీణ ప్రాంతాన్ని పునాదిగా చేసుకొని వ్యవసాయక విప్లవం కోసం తహతహలాడే విశాల రైతాంగ ప్రజారాశులపై ఆధారపడి, గెరిల్లా పోరాటం, దీర్ఘకాల ప్రజాయుద్ధాల వ్యూహాన్ని, పట్టువిడుపులతో కూడిన ఎత్తుగడలను సృజనాత్మకంగా అనుసరించి పూర్తి భోజనాన్ని ఒక్కొక్క ముద్దగా తినేట్టుగానే సరిగ్గా అదే విధంగా శత్రు బలగాలలో వివిధ భాగాలలో ఒక్కొక్క దానికి వ్యతిరేకంగా మన సైన్యంలోని ఉత్తమమైన భాగాన్ని (శత్రువు కంటే కొన్ని రెట్లు ఎక్కువ బలంగా ఉండే బలగాన్ని) వినియోగించి హఠాత్తుగా దాడి చేసి నిర్మూలించే విధానాన్ని, ఎత్తుగడలను అనుసరించడం ద్వారా శత్రు బలగాలను ఓడించి విడి విడి బ్యాటిల్స్‌లో శత్రువుపై విజయాన్ని సాధించడం ప్రజలకు పూర్తి సాధ్యమే. అందువలన ప్రజా సాయుధ బలగాలను వృద్ధి చేసుకోవడం, శత్రు బలగాల కంటే ఆధిక్యతను సంపాదించడం, శత్రువును నిర్ణయాత్మకంగా ఓడించడం సాధ్యమే.

“దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని సాగించే క్రమంలో మనం శత్రువుకు అనుకూలంగా ఉండే అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ మరిన్ని ముందు జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలి. ఒకదాని వెంట మరోటిగా త్వరితంగా విముక్తి ప్రాంతాలను నిర్మించటం సాధ్యం కాదనేది దృష్టిలో ఉంచుకొని గెరిల్లా జోన్లను అభివృద్ధి చేయడం ద్వారా మనం విముక్తి ప్రాంతాలను నెలకొల్పాలి. ప్రజాపంథాపై ఆధారపడి మనం ప్రజలను వర్గపోరాటాలలోకి మరింత నైపుణ్యంతోనూ జాగ్రత్తతోనూ సమీకరించాలి. శత్రువుకున్న ఒకే ఒక్క సానుకూలమైన అంశం (అది తాత్కాలికమైనదే అయినప్పటికీ) దాని రాజ్య యంత్రాంగపు, ప్రత్యేకించి కిరాయి సాయుధ బలగాల బలాధిక్యత మాత్రమేనని మనం తప్పక గుర్తించుకోవాలి. మరోవంక ఇతర అన్ని అంశాలు విప్లవ పార్టీ, ప్రజా గెరిల్లా సైన్యాల పక్షానే ఉన్నాయి. మన యుద్ధం న్యాయమైనది కావడం, దేశ జనాభాలోని అత్యధిక భాగపు ఆకాంక్ష అయిన భూమి సమస్యను, జాతుల సమస్యను పరిష్కరించడం మన చారిత్రక కర్తవ్యమై ఉండడం, పాలకవర్గాలలో అంతర్గత వైరుధ్యాలు, సంక్షోభం నానాటికి తీవ్రతరం అవుతుండటం, మనం సాగిస్తున్నది పాత తరహా సాంప్రదాయక యుద్ధం గాక ప్రజలను సైనికంగానూ, రాజకీయంగానూ కూడా పెద్దయెత్తున సమీకరించే ప్రజాయుద్ధం కావడం అనేవి ఈ సానుకూల అంశాలలో ప్రధానమైనవి. అందువలన శత్రువుకు అనుకూలంగా ఉన్న అంశాలు మన దేశ ప్రధాన స్వాభావిక లక్షణాల నుండి చైనా, రష్యా విప్లవాల నుండి ప్రధానంగా చైనా విప్లవం నుండి నేర్చుకున్న పాఠాల నుండి ఆవిర్భవించిన భారత విప్లవ యుద్ధపు దీర్ఘకాలిక స్వభావాన్ని మార్చజాలవు.” (‘భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు’ డాక్యుమెంట్‌లోని 43, 44 పేజీల నుండి)

ప్రత్యేకత్వానికి సాధారణత్వానికి మధ్య గతితార్కిక సంబంధం ఉంటుంది. భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్ని నిర్దిష్టంగా విశ్లేషించకపోతే భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం సాధ్యం కాదు. కేవలం జనరల్ సూత్రాలకు కట్టుబడి ఉన్నంత మాత్రాన ఏ దేశంలోని విప్లవపు నిర్దిష్ట సమస్యలు పరిష్కరింపబడవు. మరొకవైపున ఒక దేశం యొక్క ప్రత్యేక లక్షణాలు అనే పేరుతో ప్రపంచ విప్లవానుభవాల ద్వారా అభివృద్ధి చెందిన సాధారణ సూత్రాలను తోసిపుచ్చడం విప్లవాభివృద్ధికి తోడ్పడదు. విప్లవమనే గావుకేకలకే పరిమితమయ్యే పండా గారికి నిర్దిష్టంగా భారతదేశ విముక్తి కోసం ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ రూపొందించిన గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా, పిఎల్‌జిఏను పిఎల్ఏగా, డికె, బి-జె గెరిల్లా జోన్లను స్థావర ప్రాంతాలుగా మార్చే కేంద్ర కర్తవ్యాన్ని అమలు చేసే చిత్తశుద్ధి లేదు. మెల్లగా పార్లమెంటరిజంలోకి జారుకుంటూ శత్రువుతో శాంతియుత సహజీవనాన్ని కోరుకుంటున్నాడు కాబట్టే ఆయన భారతదేశంలో, ప్రత్యేకించి ఒడిశాలో కూడా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయ్యింది, ఇక్కడ పోరాట, నిర్మాణ రూపాల్లో మార్పులు రావాలి, అంటే ఇక్కడ అత్యంత రహస్యంగా సార్వత్రిక తిరుగుబాటుకు సన్నాహాలు చేయాలి అనే వాదనకు దిగాడు. అందుచేతే, పోరాట, నిర్మాణ రూపాల్ని (ఎత్తుగడలను)

యాంత్రికంగా ఇతర ప్రాంతాల్లో రుద్దుతున్నారనే పేరుతో, ప్రత్యేక పరిస్థితుల పేరుతో, నిర్బంధంలో ప్రజలు స్తబ్దతకు గురయ్యారనే పేరుతో, విప్లవ వెల్లువ లేదనే పేరుతో, కేంద్రీకృత రాజ్య యంత్రాంగమనే పేరుతో, భారతదేశంలో, ప్రత్యేకించి ఒడిశాలో విప్లవాన్ని ఎజెండాలో లేకుండా చేయ పూనుకున్నాడు.

అలాగే ఉద్యమ స్థాయితో సంబంధం లేకుండా ప్రతి చోటా యుద్ధాన్ని తీవ్రతరం చేయమని పార్టీ చెబుతున్నదనడం పచ్చి అబద్ధం. వాస్తవంగా విప్లవ వ్యూహాన్నీ, విప్లవ కేంద్ర కర్తవ్యాన్ని సఫలం చేసే లక్ష్యంతో ఉద్యమ స్థితిని బట్టి విభిన్న ప్రాంతాల్లో విభిన్న పర్‌స్పెక్టివ్‌లతో విభిన్న పోరాట, నిర్మాణాల రూపాలతో ఉద్యమాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. పార్టీ సమాజంలోని అసమానాభివృద్ధి సూత్రాన్ని ఎన్నడూ విస్మరించింది లేదు. ఉదాహరణకు ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాల/గెరిల్లాజోన్ పర్‌స్పెక్టివ్ ప్రాంతాల, గెరిల్లాజోన్ల, విముక్తి ప్రాంతాల నిర్మాణ ప్రక్రియలో ఉన్న ప్రాంతాలలో విభిన్న పోరాట, నిర్మాణ రూపాలను అమలు చేస్తున్నాం. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులలో కలిగే మార్పు, ప్రజల సంసిద్ధత, స్వీయాత్మక శక్తుల బలాబలాలకు అనుగుణంగానే యుద్ధాన్ని తీవ్రతరం చేయడమనేది జరుగుతుందే తప్ప యాంత్రికంగా అన్ని ప్రాంతాలను ఒకే గాటన కట్టింది ఎన్నడూ లేదు. అంతే గాకుండా ఒకే ప్రాంతంలో కూడా మారే పరిస్థితుల్ని బట్టి, అంటే ఆటు పోట్లను బట్టి, ఎత్తుగడల్లో మార్పు చేసుకుంటున్నాం. వర్గ రాజకీయాలకు కొనసాగింపే యుద్ధమనే సూత్రాన్ని అర్థం చేసుకోలేక వర్గ సామరస్యాన్ని కోరుకునే పండాకు యుద్ధమంటేనే పెద్ద భూతంగా కనబడటంలో ఆశ్చర్యం లేదు.

నారాయణపట్నాలో ప్రజలు పంచాయితీ ఎన్నికల్లో పాల్గొనడం అనేది లింగా, దండపాణి మహంతిల మితవాద అవకాశవాద దివాళాకోరు రాజకీయాల ఫలితంగానే జరిగింది. ప్రభుత్వ నిర్బంధం నుండి బయటపడడం అనే పేరుతో 'ఎలక్షన్ కాదు, సెలక్షన్' అనే దిగజారుడు సిద్ధాంతంతో వారు ప్రజల్ని పక్కదోవ పట్టించారు. ఈ సందర్భంగా లింగా, తెర మాటు నుండి పండా ప్రోత్సాహంతో దండపాణి మహంతి నడిపిన బూర్జువా అవకాశవాద కుట్రపూరిత రాజీ మంతనాలు నారాయణపట్నా ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు. తన దిగజారుడు సిద్ధాంతానికి సాధికారత కల్పించడం కోసం, పురోగామి భావాలకు తిలోదకాలు ఇచ్చి రెనగేడ్‌గా మారిన ఫలితంగానే పండా ఇలాంటి విప్లవ ప్రతిఘాతక సిద్ధాంతాన్ని భుజానికెత్తుకుంటున్నాడు.

అలాగే ఎలాంటి వెల్లువ లాంటి పరిస్థితులు లేకుండానే నక్సల్బరీ వసంత మేఘగర్జన కాలం నాటి నుండి ఇప్పటి వరకూ అనేక ఆటంకాలను, తిరోగమనాలను, ఓటములను ఎదుర్కొంటూ భారతదేశంలో ప్రజాయుద్ధ పురోగమనం జరిగిందని పండా లాంటి ఉచ్ఛిష్టపక్షులు తప్ప మరెవ్వరూ అనలేరు. పండా విప్లవ నాయకుడైన గడచిన దశాబ్ద కాలంలో చూసినా సింగూర్, నందిగ్రామ్, కళింగనగర్, లాల్‌గఢ్, నారాయణపట్నా, ప్రత్యేక తెలంగాణ, ఓపెన్‌కాస్ట్

వ్యతిరేక పోరాటాలు, కాకరాపల్లి, సోంపేట, జగత్‌సింగ్‌పూర్‌లో పోస్కో వ్యతిరేక పోరాటం, నియంగిరి, కుడంకుళం, జైతాపూర్, హరిపూర్ వంటి అనేక ప్రజా ప్రతిఘటనా విజృంభణలు దేశవ్యాప్తంగా మనకు స్పష్టంగా కనిపిస్తాయి. దోపిడి, పీడనలకు గురయ్యే వర్గాలు దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా తిరగబడి విప్లవ ప్రజా రాజ్యాధికారాన్ని (ఆర్‌పిసిని) నెలకొల్పడం అనే భావన పండా ఊహిస్తున్నంత సంక్లిష్టమైనదేమీ కాదు. కావాల్సిందల్లా ఎంఎల్‌ఎం దృక్పథంతో కూడిన సరియైన విప్లవ కార్యాచరణ.

ఏ దేశ విప్లవమైనా సరళరేఖలా సూటిగా సాగదు. అనేక వంకర టింకరులుగా, ఎగుడుదిగుళ్లతో, పురోగమన, తిరోగమనాలతో, ఓటమి, విజయం, ఓటమి అంతిమ విజయం దిశగానే సాగుతాయి. రష్యా, చైనా విప్లవ అనుభవాలు కూడా ఇదే విషయాలను నేర్పుతున్నాయి. చైనాలో మొదటగా నిర్మించుకున్న స్థావర ప్రాంతాలనంతా కోల్పోయి మహత్తర తిరోగమనం దీర్ఘయాత్ర (లాంగ్‌మార్చ్) తదుపరి తిరిగి విముక్తి ప్రాంతాలు ఏర్పడుతూ విప్లవం విజయవంతం అయిందనేది మన గమనంలోని విషయమే. నేడున్న అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులలో మన దేశ విప్లవం మరింత కష్టభూయిష్టంగా ఉంటుంది. పండా ఈ విషయాన్ని జీర్ణం చేసుకోలేకపోయాడు. అందుకే కాలదోషం పట్టిన రివిజనిస్టు క్షుద్ర రాజకీయాలను బయటకి తీసి పార్టీ పంథాపై దాడి చేస్తున్నాడు. ఈ అవకాశవాద దాడి అతని తిరోగమన ప్రస్థానాన్ని తెలియజేస్తున్నది. వర్గయుద్ధం చాలా క్రూరమైంది. తన పలాయనం మొదలయ్యాక మీనమేషాలు లెక్కబెడుతుండగానే శత్రువు తన క్రూరదాడి ద్వారా పండా వెనక గల ఆరుగుర్ని బలి తీసుకున్నాడు. దోపిడీ వర్గాలకు విశ్వాసం కలిగించేలా పార్టీపై నీతిమాలిన, నీలినిందల, ఘోర అబద్ధాల దాడి చేస్తున్న క్రూరుడైన శత్రువు ఎవరినీ మధ్యేవాద మార్గంలో ఉండనివ్వడు. పండా ప్రజల–విప్లవ పక్షాన్ని వదులుకున్న తర్వాత ఇక మిగిలిందల్లా దోపిడీదారుల పక్షానికి చేరడమే. ఇది తేలడానికి కూడా ఎంతో సమయం పట్టకపోవచ్చు.

## 2. అంతర్గత ప్రజాస్వామ్యం గురించి

మావోయిస్టు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అడుగంటిందనీ, పార్టీ లోపలా బయటా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను భౌతికంగా నిర్మూలించటం ద్వారా అడ్డుతొలగించుకుంటున్నారనీ, రష్యా, చైనా దేశాలలో కార్మికవర్గ పార్టీలలోనూ, కార్మికవర్గ ప్రభుత్వాలలోనూ కేంద్రీకృత ప్రజాస్వామం, మరియు కార్మికవర్గ నియంతృత్వం పేరిట తమ ప్రత్యర్థులను నిరంకుశంగా అణచివేశారనీ, అడ్డుతొలగించుకున్నారనీ అయినా కూడా అవి సోషలిస్టు వ్యవస్థలుగా మనగలగలేకపోయాయని తన లేఖలో రాశాడు. మావోయిస్టు పార్టీ నేడు అదే దారిలో పయనిస్తోందనీ, స్టాలినిస్ట్ ధోరణుల్లో భాగంగానే పార్టీ సభ్యులు తప్పులు చేసినప్పుడు క్రమశిక్షణ చర్యలో భాగంగా వాళ్లను చంపే హక్కు కూడా ఉందంటూ కేంద్రకమిటీ సభ్యులు బహిరంగ

ప్రకటనలు చేశారని ఘోరమైన అబద్ధాన్ని సిగ్గు లేకుండా తన లేఖలో రాశాడు.

ఇక అంతర్గత ప్రజాస్వామ్యం గురించి తన అభిప్రాయంగా, పార్టీలోని ప్రతిపక్షానికి రాజకీయ ప్రశ్నలపై బహిరంగంగా చర్చించే స్వేచ్ఛ, అవకాశం ఉండాలనీ, కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లలో నాయకత్వం నుండి ప్రతినిధులుగా హాజరయ్యే ఒకరిద్దరి అభిప్రాయాలపై ఆధారపడి నిర్ణయాలకు రావడం నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకోదనీ, సాధారణ పార్టీ సభ్యులకు కూడా తమ పనిలో భాగంగా ఎదురయ్యే సమస్యలపై, తమ అభిప్రాయాలను పార్టీలో అందరికీ పంచుకొనే హక్కు ఉండాలనీ మన లాంటి వెనుకబడిన దేశంలో ఇది చాలా అవసరం అని, విప్లవానంతరం ఏర్పడే నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాలలో/సోషలిస్టు ప్రభుత్వాలలో బహుళ పార్టీ వ్యవస్థకు అవకాశం ఉండాలనీ, ఇటువంటి వ్యవస్థ ద్వారా ప్రభుత్వంలో, సమాజంలో ప్రజాస్వామ్యం అమలు జరపబడుతుందనీ, ప్రజల చేత సోషలిజం రక్షించబడేందుకు బహుళ పార్టీ వ్యవస్థ సహకారంగా ఉంటుందనీ, కమ్యూనిస్టు పార్టీలో బ్యూరాక్రసీకి అడ్డుకట్ట వేస్తుందని చెప్పడమే కాకుండా, సాంస్కృతిక విప్లవం, రొడ్డకొట్టుడు దిద్దుబాటు క్యాంపెయిన్లు పెత్తందారీతనానికి, పెట్టుబడిదారీ పునరుద్ధకరణకు పరిష్కారాలు కావని రాశాడు.

ఇక్కడ పండా చెబుతున్న వాదనలలోని ప్రమాదాన్ని పసిగట్టాలి. ఎందుకంటే ఆయన ఇక్కడ ఎంఎల్‌ఎంపై ప్రత్యక్షంగా దాడి చేయకుండా మార్క్సిస్టు పదజాలం ముసుగులో మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీ మౌలిక సూత్రాలైన కేంద్రీకృత ప్రజాస్వామ్యం, నూతన ప్రజాస్వామికం, కార్మికవర్గ నియంతృత్వాలపై దాడి చేస్తున్నాడు. మార్క్సిజంపై బయట నుండి దాడి చేసే అవకాశవాదం కన్నా, లోపల నుండి దాడి చేసే అవకాశవాదమే ఎక్కువ హానికరమైనది. ఎందుకంటే ఆయన కేంద్రీకృత ప్రజాస్వామ్యం స్థానంలో రాజకీయ బహిరంగ చర్చ పేరుతో అతిప్రజాస్వామ్యాన్ని, అరాచకత్వాన్ని నిలుపుతున్నాడు. నూతన ప్రజాస్వామికం, కార్మికవర్గ నియంతృత్వం స్థానంలో బహుళ పార్టీ వ్యవస్థను నిలిపి దోపిడీ వర్గాలకు రాజ్యాన్ని అప్పజెప్పి విప్లవ ఫలితాలను దెబ్బతీయాలని చూస్తున్నాడు. ఈ తరహా అవకాశవాదులను దృష్టిలో ఉంచుకొని కా.లెనిన్ ఇలా అన్నాడు :

"వర్గపోరాటాన్ని, కార్మికవర్గపు నాయకత్వ పాత్రను మాటలలో మాత్రమే ఒప్పుకుంటారు. కానీ దాని తార్కిక నిర్ధారణ నుండి ఉద్భవించే నిర్దిష్ట కార్యాచరణను ముఖ్యంగా కార్మికవర్గ నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తారు. సారాంశంలో బూర్జువా వర్గం దేనికి భయకంపితం అవుతోందో, ఏది బూర్జువా వర్గానికి అనంగీకారమో ఆ నిర్ధారణే వారిని కూడా భయపెడుతుంది. వీరే రెండవ ఇంటర్నేషనల్ వారసులు."

కామ్రేడ్ లెనిన్ రెండవ ఇంటర్నేషనల్ వారసులపై చెప్పిన పై సూత్రీకరణ పండాకు సరిగా వర్తిస్తుంది. అందుకే పండా కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్ని

దెబ్బతీసేందుకు ఈ సూత్రాల అమలు వల్ల కమ్యూనిస్టు పార్టీలో, నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు ప్రభుత్వాలలో బ్యూరాక్రసీ పెరిగి సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయని నిర్ధారించాడు. వాస్తవంగా రష్యా, చైనాలలో సోషలిస్టు ప్రభుత్వాలు కుప్పకూలిపోవడానికి కారణమేమిటి? మార్క్సిస్టు మహోపాధ్యాయులు ఏమి చెప్పారో చూద్దాం.

సోషలిస్టు విప్లవాలు విజయవంతమైన సమాజాలలో సైతం అనేక వైరుధ్యాలతో పాటు, సన్నకారు ఉత్పత్తికి చెందిన అనేక అవకాశాల ప్రతిఘటన (తరచుగా నిష్క్రియాత్మకమైన దాన్ని, అందువలన మొండిది, అధిగమించడానికి మరీ కష్టమైనదీ అయిన దాన్ని)ను అధిగమించడం అవసరమని, ఈ అవశేషాలతో లంకెవేయబడిన అపారమైన అలవాటు బలాన్ని, యథాస్థితితత్వాన్ని అధిగమించడం అవసరమని, ఈ పరిస్థితులను అధిగమించకపోతే పెట్టుబడిదారీ పునరుద్ధరణకు బోలెడన్ని అవకాశాలుంటాయనే విషయాన్ని మార్క్సిస్టు మహోపాధ్యాయులు నొక్కి చెప్పారు. అంతేకాకుండా పై ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని సమాజంలో వర్గపోరాటాన్ని, పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని మరింత నిశితంగా కొనసాగించాలని, అందుకు కేంద్రీకృత ప్రజాస్వామ్యం, కార్మికవర్గ నియంతృత్వం అనే రెండు ఆయుధాలను విప్లవకర కార్మికవర్గం దృఢంగా అంటిపెట్టుకొని ఉండాలని మార్క్సిస్టు మహోపాధ్యాలు అనేక సందర్భాలలో నొక్కి వక్కాణించారు. కానీ పండా మాత్రం, బూర్జువా వర్గానికి కార్మికవర్గం చేతిలోని రెండు బలమైన ఆయుధాలను లేకుండా చేసేందుకు కుట్ర పన్నాడు.

రష్యా, చైనా దేశాల్లోని విప్లవ ప్రభుత్వాలు కా.లెనిన్, స్టాలిన్, మావోల నాయకత్వంలో కార్మికవర్గ నియంతృత్వ పరిపాలనను దృఢంగా అమలు జరిపాయి. పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదాలను నివారించడం కోసం తీవ్రంగా ప్రయత్నించాయి. ఈ క్రమంలో దోపిడీ వర్గాలతో అన్ని విధాలుగా లాలూచిపడి ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా విప్లవ ప్రతీఘాతక పాత్రను పోషించిన రెనగేడ్స్ విషయంలో మాత్రమే అనివార్యంగానే కామ్రేడ్ స్టాలిన్ కఠినంగా వ్యవహరించాల్సి వచ్చింది. అయితే ఈ సందర్భంగా జరిగిన తప్పులను కామ్రేడ్ మావో సైద్ధాంతికంగా విశ్లేషించి వాటిని వ్యతిరేకిస్తూనే, కామ్రేడ్ స్టాలిన్‌ను ప్రపంచ విప్లవోద్యమ నాయకుడుగా, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అన్ని వైపుల నుంచి శత్రువులు సాగించిన ముప్పేట దాడుల మధ్య సోషలిస్టు వ్యవస్థను నిలబెట్టిన వ్యక్తిగా కీర్తించాడు. రష్యా అనుభవాన్ని గుణపాఠంగా తీసుకొన్న కామ్రేడ్ మావో భూస్వామ్య, బూర్జువా విలువలతో పోరాడటానికీ, పార్టీ లోపలి బూర్జువా కేంద్రాలను కొట్టేందుకూ, పార్టీని, మొత్తం సమాజాన్ని విప్లవకరంగా తీర్చిదిద్దేందుకు గానూ అతి పెద్ద వర్గపోరాటంగా కార్మికవర్గ సాంస్కృతిక మహా విప్లవాన్ని ఆవిష్కరించి, అందులో పాల్గొనమని పార్టీ శ్రేణులకు, దేశ ప్రజలకు పిలుపు నిచ్చాడు. ఈ పిలుపును అందుకొని 'స్వార్థంపై పోరాడు, రివిజనిజాన్ని విమర్శించు' అనే విప్లవ ప్రధాన

నినాదంతో ప్రజలు కోట్లాది మంది కదిలి రాజకీయ కార్యాచరణలోకి దూకారు. అయితే ఈ సాంస్కృతిక మహా విప్లవంలో వచ్చిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని పెట్టుబడిదారీ విధానం తిరిగి తలెత్తకుండా ఉండాలంటే కమ్యూనిజం ఏర్పడేదాక, నూతన మానవుని సృష్టి జరిగేదాక అనేక సాంస్కృతిక విప్లవాలు జరగాలని కామ్రేడ్ మావో నొక్కి చెప్పాడు. కా.స్టాలిన్, కా.మావోల అనంతరం పెట్టుబడిదారీ మార్గేయులైన కృశ్చేవ్, డెంగ్ ముఠాలు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఆధిపత్యాన్ని సంపాదించుకున్నాయి. తత్ఫలితంగా రష్యా, చైనాలలో కమ్యూనిస్టు పార్టీలు రివిజనిస్టు పార్టీలుగానూ, కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వాలు బూర్జువావర్గ నియంతృత్వ ప్రభుత్వాలుగానూ తిరోగమించాయి. ఈ దేశాలు నూతన తరహా పెట్టుబడిదారీ రాజ్యాలుగా మారాయి. కానీ పండా మాత్రం ఉద్దేశ్యపూర్వకంగానే ఈ వాస్తవాలను మరుగుపరిచాడు. సోషలిజం వైఫల్యానికి కేంద్రీకృత ప్రజాస్వామ్యం, కార్మికవర్గ నియంతృత్వాలే కారణం అంటున్నాడు. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే, వాటి పేరుతో ప్రజాస్వామ్యం గొంతు నొక్కివేయబడి పెత్తందారీతనం, నియంతృత్వం అమలైనాయని గగ్గోలు పెడుతున్నాడు. పండా ఈ దాడిని మహత్తర రష్యా, చైనా కమ్యూనిస్టు పార్టీలపైనా, విప్లవోద్యమాలపైనా, సోషలిజంపైనా, అంతిమంగా మార్క్సిజం-లెనినిజం- మావోయిజంలపైనా ఎక్కుపెట్టాడు. అతను శ్రామికవర్గ ప్రయోజనాలకు, సోషలిజానికి, కమ్యూనిజానికి వ్యతిరేకి. అతను ప్రజాస్వామ్యం పేరుతో యథాతథ స్థితిని, బూర్జువా సమాజాన్ని, బూర్జువా నియంతృత్వాన్ని కోరుకుంటున్నాడు. అందుకే విప్లవ కమ్యూనిస్టు పార్టీలో విప్లవాన్ని తూట్లు పొడవడానికి రివిజనిజాన్ని, సోషలిస్టు సమాజంలో పెట్టుబడిదారీ పునరుద్ధరణను ప్రవేశపెట్టేందుకు 'ప్రజాస్వామ్యం', 'స్వేచ్ఛ' కావాలని గావుకేకలు పెడుతున్నాడు. ఈ సందర్భంగా కార్మికవర్గ నియంతృత్వంపై కామ్రేడ్ లెనిన్ చెప్పిన విషయాన్ని మనం మననం చేసుకోవాలి.

"శ్రామికవర్గ నియంతృత్వమంటే కూలదోయబడినప్పటీ, పూర్వం కంటే పది రెట్లు బలం కలిగిన పెట్టుబడిదారీ వర్గంతో (తన వర్గం అను శ్రామికవర్గం) సాగించే తీవ్రమైన, కఠినమైన పోరాటం రక్తపాతంతోనూ, శాంతియుతంగానూ, మిలటరీ వ్యవహారాల్లోనూ, ఆర్థిక విషయాల్లోనూ, విద్యారంగంలోనూ, పరిపాలనాంశాల్లోనూ, పాత సామాజిక శక్తులకూ, సంప్రదాయాలకూ వ్యతిరేకంగా చేయవలసిన ఎడతెగని పోరాటమే శ్రామికవర్గ నియంతృత్వం."

నేడు రష్యా, చైనా దేశాలు సోషలిస్టు దేశాలుగా లేకపోయినప్పటికీ వీటి అనుభవాలు నుంచి నేర్చుకుంటూ కార్మికవర్గ నియంతృత్వం, మహత్తర సాంస్కృతిక విప్లవాల ఆవశ్యకతను మరింతగా గుర్తిస్తూ ముందుకు సాగాలే తప్ప పండా ప్రతిపాదించినట్లుగా కార్మికవర్గ నియంతృత్వానికి, సాంస్కృతిక విప్లవాలకు కాలం చెల్లిందని దాని స్థానంలో బహుళ పార్టీ వ్యవస్థ, బహుళ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ముందుకు తేవడం అనేది విప్లవ పదజాలం ముసుగులో దోపిడీ వ్యవస్థను పరిరక్షించే ఆధునిక రివిజనిజం మాత్రమే. అందుకనే ఈ అవకాశవాదికి

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ స్టాలిన్ దోపిడీ వర్గాలకు కనిపించిన విధంగానే నియంతలా కనిపించడంలో ఆశ్చర్యకరమైందేమీ లేదు. ఇంకా పండా ఎంతగా బరితెగించాడంటే కామ్రేడ్ మావో అనంతరం చైనాలో ఏర్పడిన ఆధునిక రివిజనిస్టు డెంగ్ ప్రభుత్వాన్ని, నేపాల్‌లో విప్లవ ద్రోహి, ఆధునిక రివిజనిస్టు ప్రచండ ప్రభుత్వాన్ని సోషలిస్టు ప్రభుత్వాలుగా పేర్కొంటూ అక్కడ కూడ కార్మికవర్గ నియంతృత్వంలో కక్షసాధింపు చర్యలు జరిగాయని రాశాడు.

ఇక మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అమలు చేసేందుకు మార్గదర్శకత్వంగా రూపొందించుకున్న కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రాలను పార్టీ నిబంధనావళిలో ఏ విధంగా పొందుపరిచామో చూద్దాం. అయితే మేమిక్కడ పేర్కొన్న సుదీర్ఘ ఉల్లేఖనలను చదవటంలో కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ, మా పార్టీ ఆంతరంగిక జీవితాన్ని అర్థం చేసుకుని పండా చెప్పే కుహనా ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకునేందుకు దోహదపడుతుందని ఇవి దోహదపడతాయని ఆశిస్తున్నాం.

**"అధ్యాయం 5 – పార్టీ నిర్మాణ సూత్రాలు**

"ఆర్టికల్ 25 : ఎ) పార్టీ నిర్మాణ సూత్రం కేంద్రీకృత ప్రజాస్వామ్యం. పార్టీ నిర్మాణ స్వరూపం, ఆంతరంగిక జీవనం ఈ సూత్రం పైన ఆధారపడి ఉంటుంది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే, పార్టీ ఆంతరంగిక ప్రజాస్వామ్యంపై ఆధారపడిన కేంద్రీకరణ మరియు కేంద్రీకృత నాయకత్వం కింద పార్టీ ఆంతరంగిక ప్రజాస్వామ్యం. మనసు విప్పి మాట్లాడుకుంటూ, పార్టీ పనిలో సమైక్యంగా ఉంటూనే, కేంద్రీకరణ, ప్రజాస్వామ్యం, క్రమశిక్షణ, స్వేచ్ఛ, సంకల్ప సమైక్యత, మానసిక ప్రశాంతత, జవజీవాలతో తొణకిసలాడటం, ఇవన్నీ ఉండే ఒక రాజకీయ వాతావరణాన్ని సృష్టించాలి. కేవలం ఇటువంటి వాతావరణంలోనే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని విజయవంతంగా అమలు చేయవచ్చు.

"బి) నిర్మాణ స్వరూపానికి సంబంధించిన అతి ముఖ్య కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం ఏమిటంటే, అన్ని స్థాయిలలోని నాయకత్వ కమిటీలు ప్రజాస్వామిక చర్చలు, మహాసభలు, ప్లీనంల ప్రాతిపదికపైనే తప్పనిసరిగా ఎన్నుకోబడాలి. ఎన్నికైన కమిటీలకు పైస్థాయి కమిటీల అనుమతి లభించాలి. ముఖ్యంగా వ్యక్తి నిర్మాణానికి లోబడి ఉండాలి. మైనారిటీ మెజారిటీకి లోబడి ఉండాలి. కిందిస్థాయి పైస్థాయికి లోబడి ఉండాలి. మొత్తం పార్టీ కేంద్రకమిటీకి లోబడి ఉండాలి అన్నది మొత్తం పార్టీ అనుసరించాల్సిన సూత్రం.

"సి) పార్టీ నాయకత్వ కమిటీలు కాంగ్రెస్/మహాసభ లేదా ప్లీనాలలో నిర్మాణ నివేదికను ప్రవేశపెడతాయి. ఈ కమిటీలు పార్టీ లోపల, పార్టీకి వెలుపల ఉన్న ప్రజల అభిప్రాయాలను వింటాయి. వారికి జవాబుదారీ వహిస్తాయి. పార్టీ సభ్యులకు విమర్శలు చేసి, తమ అభిప్రాయాలను/తీర్మానాలను పై కమిటీలకు పంపే హక్కు ఉంటుంది. ఒక పార్టీ సభ్యుడు/

సభ్యురాలికి ఎవరికైనా భిన్నాభిప్రాయం ఉంటే అతను/ఆమె పై కమిటీకి, అలా కేంద్రకమిటీ దాకా తన అభిప్రాయాలను పంపుకోవచ్చు.

"జి) నిర్ణయాలు జరగక ముందు పార్టీలోని ప్రతి సభ్యుడు/సభ్యురాలు సంబంధిత పార్టీ యూనిట్లలో స్వేచ్ఛగా చర్చించవచ్చు. అతడు/ఆమె పార్టీ విధానాల పైన, వివిధ సమస్యల పైన తన అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చు. కొన్ని సందర్భాలలో తన అంతిమ అభిప్రాయాన్ని వెల్లడించకుండా అందుకు కారణాలను వివరించి అబ్‌స్టైన్ కావచ్చు. అయితే ఒకసారి నిర్ణయం తీసుకున్న తరువాత ప్రతి ఒక్కరూ తు.చ. తప్పకుండా వాటికి కట్టుబడి ఉండాలి. కాని ఒక సభ్యుడు/సభ్యురాలికి అప్పటికీ భేదాభిప్రాయం ఉన్నట్టయితే అతడికి/ఆమెకు తన అభిప్రాయాన్ని రిజర్వు చేసుకొనే హక్కు ఉంటుంది. కాంగ్రెస్/మహాసభలలో చర్చించి నిర్ణయం తీసుకున్న సమస్యలపై ఆ వెనువెంటనే చర్చలు లేవనెత్తడం అనుమతించబడదు.

"ఏ సభ్యుడు/సభ్యురాలైనా సంబంధిత కమిటీలలో కొత్త సమస్యలపై చర్చలను లేవదీయవచ్చు. అతడు గానీ/ఆమె గానీ ఈ సమస్యలు మొత్తం పార్టీకి సంబంధించినవిగా భావించినట్లయితే అతడు/ఆమె తన కమిటీ ద్వారా కొన్ని ప్రత్యేక పరిస్థితులలో నేరుగా కేంద్రకమిటీ వరకూ తన అభిప్రాయాలను పంపవచ్చు. కేంద్రకమిటీ సభ్యులలో మూడింట ఒక వంతు మంది ఆ అభిప్రాయంతో ఏకీభవించి దాని పరిష్కారానికి ప్లీనం జరపాలని అభిప్రాయపడితే అప్పుడు దాన్ని కనీసం రాష్ట్ర కమిటీల వరకు సర్క్యులేట్ చేయాలి. రాష్ట్ర కమిటీలలో మెజారిటీవి ఈ డిమాండుతో ఏకీభవిస్తే అప్పుడు కేంద్రకమిటీ ప్లీనం నిర్వహిస్తుంది. ఇటువంటి ప్రత్యేక సందర్భాలలో కేంద్రకమిటీ సమస్యలను పరిష్కరించుకునే ప్రజాస్వామిక పద్ధతి అనుసరించబడేటట్టు ఖాయం చేస్తుంది.

**"అధ్యాయం 6 – పార్టీ క్రమశిక్షణ**

"ఆర్టికల్ 26 : పార్టీ ఐక్యతను కాపాడడానికి, పోరాట పటిమను పెంపొందించడానికి కేంద్రీకృత ప్రజాస్వామ్య విధానాన్ని అమలు చేయడానికి పార్టీ క్రమశిక్షణ ఒక తప్పనిసరి అవసరం. ఉక్కు లాంటి క్రమశిక్షణ లేకుండా, ఏ విప్లవ పార్టీ అయినా సరే, ప్రజలకు యుద్ధంలో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఇవ్వలేదు. విప్లవ బాధ్యతను నెరవేర్చలేదు. నాయకత్వంతో సహా పార్టీ సభ్యులందరికీ పార్టీ క్రమశిక్షణ ఒకే తీరులోనే వర్తిస్తుంది.

**"అధ్యాయం 10 – పార్టీలో ఆంతరంగిక వాదోపవాదాలు**

"ఆర్టికల్ 44 : మొత్తం పార్టీని సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా, నిర్మాణపరంగా ఏకం చేసి మన పద్ధతులను మెరుగుపర్చుకోవడానికి లోతైన చర్చలను నిర్వహించడం చాలా ఆవశ్యకం. ఇది పార్టీ సభ్యుల ప్రజాస్వామిక హక్కు కూడా. పార్టీలోని వేరు వేరు స్థాయిలలో ఎత్తుగడలతో సంబంధమున్న సమస్యలను సంబంధిత కమిటీలలో మనసు విప్పి చెప్పి,

నిస్సంకోచంగా మాట్లాడి వాదోపవాదాల ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలి. అవసరమైనప్పుడు పై కమిటీల సాయం, సలహాలను తీసుకోవాలి. పార్టీ సభ్యుల ప్రజాస్వామిక హక్కుల పేరిట ఒకానొక సమస్యపై అంతూ–పొంతూ లేకుండా సాగే వాదనలు, కేవలం పార్టీ విధుల నిర్వహణను దెబ్బతీస్తాయి. అందువల్ల ఏ రకమైన వివాదాస్పద వాదోపవాదాలు లేదా చర్చలను సంబంధిత కమిటీలలో 2/3 వంతుల మంది ఆమోదిస్తేనే వాటిని అనుమతించవచ్చు.

"ఆర్టికల్ 50 : ఒక సభ్యుడు/సభ్యురాలికి గానీ లేదా ఒక కమిటీకి గానీ పార్టీ మౌలిక పంథాపై భిన్నాభిప్రాయం ఉంటే, తన అభిప్రాయాలను పార్టీలో సర్క్యులేట్ చేయమని డిమాండు చేస్తే ఈ డిమాండ్‌ను ఆమోదించాలా, తిరస్కరించాలా అనే విషయంలో అంతిమ నిర్ణయం తీసుకొనే హక్కు కేంద్రకమిటీకి ఉంది.

"ఆర్టికల్ 51 : కేంద్రకమిటీ సభ్యులలో ఏ సభ్యుడు/సభ్యురాలికైనా భారతదేశ లేదా అంతర్జాతీయ సమస్యలపై భిన్నాభిప్రాయాలుండి, మొత్తం ముందుకు ఆ అభిప్రాయాన్ని తీసుకెళ్లాలని అతడు/ఆమె డిమాండు చేస్తే అటువంటి సందర్భంలో కేంద్రకమిటీలోని 1/3 వంతు సభ్యులు ఆమోదిస్తే ఈ అభిప్రాయాలను రాష్ట్ర/రీజినల్ కమిటీలకు గానీ మరే స్థాయి కమిటీలకు గానీ పంపవచ్చు అయితే ఏ కమిటీ సభ్యుడు/సభ్యురాలు అయినా గానీ కేంద్రకమిటీ అనుమతి లేకుండా తన భిన్నాభిప్రాయాలను కింది స్థాయి కమిటీలకు పంపరాదు.

"ఆర్టికల్ 52 : కింది స్థాయి కమిటీకి గానీ, కమిటీ సభ్యుడు/సభ్యురాలికి గానీ కేంద్రకమిటీ రాజకీయ నిర్మాణ పంథాపై భేదాభిప్రాయం ఉంటే అప్పుడు వారు పార్టీ కమిటీల పని పద్ధతుల కనుగుణంగా తన అభిప్రాయాలను కేంద్రకమిటీకి పంపవచ్చు. అవసరమైతే కేంద్రకమిటీ తన అభిప్రాయాలను ఈ అభిప్రాయాలకు జతపర్చి మొత్తం పార్టీకి అందజేయవచ్చు.

"ఆర్టికల్ 53 : కేంద్రకమిటీ నియంత్రణ కింద గానీ దాని ఆదేశం కింద గానీ పార్టీలో జరిగే అన్ని చర్చలను స్పెషల్ ఏరియా/స్పెషల్ జోనల్/రాష్ట్ర కమిటీల వరకు గానీ, పార్టీలోని అన్ని స్థాయిల వరకు గానీ పంపడం జరుగుతుంది.

పై నిబంధనలు కేవలం డాక్యుమెంటుకు పరిమితమైనవి కావు. అవి కామ్రేడ్స్ లెనిన్, మావోలు చెప్పిన కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని ఆచరణలో అమలు చేస్తూ, పార్టీని బోల్షివీకరణ చెందించే క్రమంలో అభివృద్ధి చేసిన సూత్రాలు అవి. అవి నేడు మా పార్టీ ఆంతరంగిక జీవితంలో ముఖ్యమైన, ఆచరణాత్మక సూత్రాలుగా పనిచేస్తున్నాయి. ఈ విషయాలన్నీ పండాకు తెలియనివి కావు. కానీ పండా కోరుకునేది కార్మికవర్గ పార్టీ క్రమశిక్షణకు, నిర్మాణ సూత్రాలకు లోబడిన ప్రజాస్వామ్యం ముసుగులోని అవకాశవాదం. పార్టీ భావ సమైక్యతకు, క్రమశిక్షణకు, ఆచరణకు తీవ్ర నష్టం కలిగించే అరాచకవాదమే గాకుండా కార్మికవర్గ, పీడిత ప్రజల సమిష్టి ప్రయోజనాలకు విరుద్ధమైన బూర్జువా అరాచకవాద వ్యక్తి స్వేచ్ఛను, అరాచక

పద్ధతులను పార్టీలో కొనసాగించడానికి తావుండాలనేదే తన చర్చంతా. అందుకనే రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదులు ఆశించినట్లుగానే నానాగోత్రీకులైన పార్టీ సభ్యులు, నాయకులు ఎవరికి తోచిన పద్ధతుల్లో వాళ్లు ఉండే పార్టీ నిర్మాణ స్వరూపాన్ని పండా ప్రతిపాదిస్తున్నాడు. తన స్వార్థపూరిత ప్రయోజనాల కోసం ఏ ఎండకాగొడుకు పట్టే పండా లాంటి వారికి ఇలాంటి క్రమశిక్షణా రహిత, విప్లవ సాధనా లక్ష్యం లేని పెట్టీబూర్జువా- బూర్జువా ఉదారవాద నిర్మాణం ఎంతగానో నచ్చుతాయనడంలో సందేహం లేదు.

అందుకే పండా పార్టీలోని అంతర్గత ప్రజాస్వామ్యంపై కావాలనే బురద జల్లుతున్నాడు. పండా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని చూడలేకపోవడానికి, బూర్జువా ప్రజాస్వామిక దురాభిప్రాయాలను నిలువెల్ల నింపుకొని ఉండటమే కారణం. తద్వారా తాను పార్టీలోకి చొచ్చుకువచ్చిన బూర్జువా వర్గపు ఏజెంటుగా లేదా బూర్జువా భావాలను వదిలించుకోలేని అపర విప్లవకారుడిగా నిరూపించుకున్నాడు. ఇతడు బూర్జువా వర్గ ఏజెంటు కావడం వల్లనే పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రంపై ఆధారపడి అమలవుతున్న విషయాలన్నింటిని దురుద్దేశంతో వక్రీకరించి బాహాటంగా తప్పుడు ప్రచారానికి పూనుకున్నాడు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని చెప్పేందుకు ఆయన ముందుకు తెచ్చిన మరి కొన్ని విషయాలను పరిశీలిద్దాం.

2004లో ఎంసిసిఐతో ఐక్యత కోసం, కింది పార్టీ శ్రేణులలో డిబేట్ చేయకుండానే 5వ మౌలిక వైరుధ్యాన్ని (నిరంకుశ దళారీ బూర్జువా వర్గానికి, భారత ప్రజానీకానికి మధ్య) మునుపటి పిడబ్ల్యు తొలగించిందనీ, ఇది పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని రాశాడు. కానీ వాస్తవంగా ఆనాడు జరిగిందేమిటి? ఆనాడు భారత విప్లవ చరిత్రలో ఒక మైలు రాయిలా నిలిచే విప్లవ పార్టీల ఐక్యతా ప్రక్రియ ఎజెండాలోకి వచ్చింది. భారతదేశంలో ఒక బలమైన, కేంద్రీకృత, దేశవ్యాపిత విప్లవ పార్టీని నిర్మించడంలో భాగంగా పీపుల్స్‌వార్, ఎంసిసిఐలు ఐక్యతా చర్చలు జరిపాయి. ఈ ఐక్యత భారత విప్లవంలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగినట్టిది. ఆ చర్చలలో భాగంగా రెండు పార్టీలూ చర్చల క్రమంలో ఐక్యత సాధన కోసం తమ తమ పాత అవగాహనలలో కొన్నింటిని వదులుకున్నాయి. అందులో భాగంగానే ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన కేంద్రకమిటీ 5వ మౌలిక వైరుధ్యాన్ని ఉపసంహరించుకునేందుకు సిద్ధపడుతూనే కింది కేడర్ నుండి ఎవరైనా 5వ మౌలిక వైరుధ్యంపై కాంగ్రెసులో చర్చించే అవకాశాన్ని అట్టిపెట్టుకుంటూనే ఐక్యతకు సిద్ధపడింది. ఐక్యత అనంతరం ఈ విషయాన్ని కింది పార్టీ సభ్యుల వరకు తీసుకొచ్చింది. ఆనాటి చారిత్రక పరిస్థితులలో ఐక్య పార్టీని ఏర్పర్చడం విప్లవ పురోగమనంలో ఒక గొప్ప విజయంగా భావించిన మునుపటి యావత్తు పీపుల్స్‌వార్ పార్టీ సిసి నిర్ణయాన్ని ఆమోదించింది. అయితే ఆనాటికి పండాకు మాదిరిగానే 5వ మౌలిక వైరుధ్యం రద్దుపై కొద్దిమంది కామ్రేడ్స్‌కు భిన్నాభిప్రాయాలున్నప్పటికీ విప్లవ పార్టీల ఐక్యతకున్న ప్రాధాన్యతను

గుర్తించి కాంగ్రెసులో ఎవరూ ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు ముందు లేవనెత్తలేదు. కానీ పెటీ బూర్జువా వ్యక్తివాదం, అరాచకత, ఒంటెత్తుపోకడలు వంటి పెడధోరణలు కలిగిన పండాకు మాత్రం తాను పార్టీ నుండి వైదొలగాలనుకున్న తర్వాత ఈ నిర్ణయం అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడంగా అనిపించింది.

ఇంకా ఆయనను ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌కు తీసుకెళ్లలేదనీ, కేవలం కాంగ్రెస్‌కు వెళ్లిన కొద్దిమంది అభిప్రాయాలే పార్టీ నిర్ణయాలుగా మారాయని, కేడర్ అభిప్రాయాలు తీసుకోలేదని ఇవన్నీ కూడా అంతర్గత ప్రజాస్వామ్యం ఉల్లంఘనలోకి వస్తాయని రాశాడు. ఇన్ని అబద్ధాలు కేవలం బూర్జువావర్గ పక్షవాత రోగం ముదిరినవాడే రాయగలుగుతాడు. వాస్తవంగా ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌కు ముందుగానే కేంద్రకమిటీ పార్టీ మౌలిక డాక్యుమెంట్ల ముసాయిదాలను యావత్తు పార్టీలో పార్టీ సభ్యుల వరకు పంపింది. ఈ డాక్యుమెంట్లపై పార్టీ సభ్యుల అభిప్రాయాలను సేకరించడంలో భాగంగా కింది నుండి కాన్ఫరెన్సులు జరిపింది. అంతిమంగా వారి అభిప్రాయాలకు ఉన్నతమైన క్రోడీకరణగా కాంగ్రెస్‌లో లోతైనా చర్చలు జరిగిన తర్వాత మౌలిక డాక్యుమెంట్లకు తుది రూపం ఇవ్వడం జరిగింది. అత్యంత ప్రజాస్వామికంగా జరిగిన కాంగ్రెస్ ప్రక్రియ పండాకు మాత్రం అప్రజాస్వామికంగానే కనిపించింది. ఇందుకు బలమైన కారణమేమీ లేదు. కేవలం తనను కాంగ్రెస్‌కు ప్రతినిధిగా పిలవ లేదనే అక్కసుతోనే నేడు పార్టీపై ఇటువంటి బురదజల్లే వైఖరిని తీసుకున్నాడు. ఇది అతని సంకుచిత, స్వార్థపూరిత స్వభావాన్ని తెలియజేస్తున్నది. వాస్తవంగా ఆనాడు కాంగ్రెస్‌కు ప్రతినిధుల ఎంపిక విషయంలో కేంద్రకమిటీ శాస్త్రీయమైన ప్రజాస్వామికమైన పద్ధతిని రూపొందించింది. ప్రధానంగా పార్టీ సభ్యుల సంఖ్యను ప్రాతిపదికగా తీసుకొని ఆ నిష్పత్తిలో ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించే పద్ధతిని అనుసరించింది. దీని ప్రకారం ఒడిశాలో ఉన్న పార్టీ సభ్యుల సంఖ్య ప్రాతిపదికన కాంగ్రెస్ ప్రతినిధిగా ఒక్కరికే అవకాశం లభించింది. దీంతో ఎస్ఓసి కార్యదర్శి ఒక్కడే కాంగ్రెస్ ప్రతినిధిగా ఎంపికయ్యాడు. కానీ స్వార్థం, పదవీ వ్యామోహం, అహంభావం, సంకుచితత్వం నిలువెల్లా నింపుకున్న పండాకు మాత్రం తనను ప్రతినిధిగా పిలవకుండా ఎస్ఓసి కార్యదర్శిని పిలవడం అప్రజాస్వామికంగా అనిపించింది. అయితే పండా కాంగ్రెస్‌కు రాకపోయినప్పటికీ బేసిక్ డాక్యుమెంట్లపై అతని సవరణలను, అభిప్రాయాలతో పాటు ఒడిశా పార్టీ కేడర్ల సవరణలు, అభిప్రాయాలన్నింటినీ ఎస్ఓసి కార్యదర్శి కాంగ్రెస్‌కు తీసుకొచ్చాడు. ఈ అభిప్రాయాలు కాంగ్రెస్ చర్చలలో భాగమైనాయి. అయినా పండా కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి తన అభిప్రాయాలను బహిరంగంగా ప్రచారం చేసుకునే, ఆచరణలో పెట్టే అవకాశం ఉండాలనే ఉద్దేశ్యంతోనే పార్టీ తన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోలేదని అబద్ధపు ఆరోపణలు చేస్తున్నాడు.

మరో విషయమేమిటంటే రాజకీయ ప్రత్యర్థులను తొలగించడం లేదా నిర్మూలించడం జరుగుతున్నదనీ, పార్టీలో క్రమశిక్షణా చర్యలలో భాగంగా మరణశిక్ష ఉంటుందనీ ఒక సిసిఎం అన్నట్లుగా ప్రచారం చేస్తూ వచ్చాడు. ఈ విషయాలను పార్టీ చరిత్ర తెలిసిన సాధారణ వ్యక్తులు సైతం నమ్మరు. ఎందుకంటే పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయనీ, వాటిలో కొన్ని సరయినవి, మరికొన్ని తప్పుడువి ఉంటాయనీ, తప్పొప్పులకూ, సరైందానికీ కాని దానికీ మధ్య పోరాటం ఉంటుందనీ, ఆ పోరాటం గుండానే పార్టీ అభివృద్ధి చెందుతుందనే శాస్త్రీయ దృక్పథాన్ని పార్టీ కలిగి ఉంటూ అమలు చేస్తున్నది. అంతే కాకుండా భిన్న రాజకీయ అభిప్రాయాలు కలిగి ఉండి కూడా మెజారిటీకి కట్టుబడినంత కాలం వారిని పార్టీలో కొనసాగనీయాలని ద్రోహులుగా మారితేనే పార్టీ నుండి బహిష్కరించాలనే మావోయిస్టు అవగాహనను మా పార్టీ అక్షరాలా అమలు చేస్తున్నది. మొత్తం పార్టీ చరిత్రలో రాజకీయంగా భిన్నాభిప్రాయాలను కలిగి ఉన్న వాళ్లను ఒక్కరినైనా కూడ తొలగించిన సంఘటనను గానీ, నిర్మూలించిన సంఘటనను గానీ పండా సైతం చూపించలేడు. కానీ పోలీసులు పార్టీలోకి పథకం ప్రకారం పంపించే కోవర్టుల పైనా, ఏజెంట్ల పైనా పార్టీ చర్య తీసుకుంటున్నది. ఈ చర్యలను ఉద్యమ పురోగమనంలో భాగంగా అవసరంగానే భావిస్తున్నది. 2010లో ఒడిశా పోలీసులు సుశాంత్ అనే కోవర్టును పార్టీలోకి పంపి నాయకత్వాన్ని హత్య చేసేందుకు ప్రయత్నించారు. సుశాంత్, రవి అనే మరో సభ్యుడ్ని కోవర్టుగా తయారు చేశాడు. ఈ విషయం 2011 చివరికి అర్థమై వాళ్లిద్దరిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తే రవి దొరికాడు. సుశాంత్ పారిపోయి పోలీసుల చెంత చేరాడు. ఈ సందర్భంగా పార్టీని రవిని ఇంటరాగేట్ చేసి, ద్రోహి అని నిర్ధారించుకున్న తర్వాతనే చంపింది. పండా మాత్రం ఇలాంటి ద్రోహులు పార్టీకి ఎంత తీవ్రమైన నష్టం చేసినా చింతించకపోగా, దోపిడీవర్గ ప్రయోజనాలకు బానిస అయి ఈ చర్యను సహించలేకపోయాడు. ఈ ఆక్రోశంతోనే పార్టీలో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా చంపటం ఉంటుందని ఒక సిసిఎం అన్నట్లు దుష్ప్రచారానికి పూనుకున్నాడు.

పండా ఈ రోజు మా పార్టీ పంథా పైనా, రాజకీయాల పైనా, విప్లవ జీవితం పైనా పుంఖానుపుంఖంగా పెడుతున్న విమర్శలను, వ్యక్తం చేస్తున్న భావాలను పార్టీలో కొనసాగుతున్నప్పుడు ఒక్క వేదిక పైన కూడా మాట్లాడలేదు. ఎందుకంటే తన భావాలను నిజమైన కార్మికవర్గ పార్టీలోని ఏ ఒక్క సభ్యుడు/సభ్యురాలు ఆమోదించరు కనుక. 2004లో జరిగిన బాసధార డివిజన్ ప్లీనంలోనూ, 2012లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక ప్లీనంలోనూ పండాలో బహిర్గతమైన కొన్ని పెడధోరణులపై మాత్రమే కేడర్ నుండి విమర్శలు వచ్చాయి. ఆ విమర్శలకే తనని పార్టీ టార్గెట్ చేస్తుందని భూమ్యాకాశాలు దద్దరిల్లేలా గగ్గోలు పెట్టాడు. ఈ మోసకారి అసలు స్వరూపం ఆనాడే బహిర్గతమైట్లయితే, ఉలిపి కట్టెలాగా ఒక్కడే పార్టీ నుండి బయటికి పంపబడేవాడు. కానీ మోసపూరితంగా తన భావాలను బయటకు వ్యక్తం చేయకుండా పార్టీలో కొందరు అమాయకులను, రాజకీయ బలహీనతలు కలిగిన కొద్దిమందిని రకరకాల

తప్పుడు పద్ధతుల్లో సమీకరించి పార్టీ నుండి తన వెంట తీసుకెళ్లాడు. ప్రజాస్వామ్యం గురించి ఇంత గగ్గోలు పెట్టిన ఈ మహానుభావుడు చివరి రోజులలో మరింతగా బరితెగించి తనకు ప్రతికూలంగా ఉన్నవారి విషయంలో పచ్చి బ్యూరోక్రాట్‌లా కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డాడు. భార్యా భర్తలలో ఒకరిని మరొకరికి కలవకుండా చేసి అందులో ఒకరిని తనకనుకూలంగా మలుచుకొని వారిని విడదీయడం, పెళ్లి కాబోయే జంట విషయంలోనూ ఇలాగే చేసి వారిని విడగొట్టడం, ఒడిశాలో పనిచేస్తూ చాలా కాలం తర్వాత ఇళ్లు చూడడానికి వెళ్లే డికె కామ్రేడ్స్ నుండి ఆయుధాలు తీసుకొని, తిరిగి రావద్దని నిరుత్సాహపరచడం, వాళ్ల ఆత్మరక్షణకు ఏ మాత్రం బాధ్యతపడకుండా ప్రమాదంలోకి నెట్టడం, అప్పటికే తీర్మానాలు జరిగి బదిలీ చేయాల్సిన కామ్రేడ్స్‌ను పార్టీ పద్ధతులకు భిన్నంగా తన వద్దే ఉంచుకోవడం వంటి గ్రామీణ పెత్తందారీ తరహా కుటిల పద్ధతులు అవలంబించాడు.

పండా ప్రజాస్వామ్యం గురించి ఇంత గగ్గోలు పెట్టింది బూర్జువా వర్గానికి సేవ చేసేందుకే. ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే దోపిడీ వర్గాలకు తాను దాసోహం అవటమే కాకుండా పార్టీనంతా దాసోహం అయ్యేలా చేయడమే. పార్టీలో ఉండి ప్రజాస్వామికంగా చర్చించే కార్మికవర్గ చైతన్యం కొరవడి ధైర్యం లేక తాను ఒంటరినయ్యాననే అక్కసుతో పార్టీపై ఈ రోజు ఏ రాయిబడితే ఆ రాయి విసురుతున్నాడు.

## 3. మావోయిస్టులు మతిలేని హింసకు పాల్పడుతున్నారు, చంపడం అనేది ఫ్యాషన్‌గా మారింది, మావోయిస్టుల దుందుడుకు చర్యల కారణంగానే శాంతి కమిటీలు/సేనలు, సల్వాజుడుం అభియాన్లు పుడుతున్నాయనే విమర్శపై

దోపిడి వర్గాల రాజ్యం తనకున్న సకల అస్త్రాలతో పోరాడే ప్రజలపై అణచివేతకు పూనుకుంటుంది. ఇక ఆ పోరాటం ప్రజల విముక్తి కోసం, అంటే పీడిత ప్రజల రాజ్యాధికారం కోసం అయినప్పుడు ఈ రాజ్యం మరింత తీవ్రమైన అణచివేతకు పాల్పడుతుంది. దాని పోలీసు, కమాండో, పారా మిలటరీ, మిలటరీలు ముందుండి ఆ దాడిని కొనసాగించగా, దాని ఇతర సకల ప్రభుత్వ అంగాలూ ఆ దాడిలో ఒక పథకం ప్రకారం సమన్వయంతో, అత్యంత క్రూరంగా, కుట్రపూరితంగా పాల్గొంటాయి. అందుకని ప్రజలకు ఈ హింసను ఎదిరించడానికి ప్రతిహింస, సాయుధ పోరాటం అత్యవసరమవుతుంది. మార్క్సిజం గురించి ప్రాథమిక పాఠాలు తెల్సిన వారెవరికైనా విప్లవ హింస గురించిన ఈ మౌలిక, ప్రాథమిక విషయం తెలిసే ఉంటుంది. కానీ మార్క్సిస్టు పండితుడైన పండాకు ఈ విషయమే తెలియదు.

మతిలేని హింస పేరుతో సిద్ధాంతపరంగా విప్లవ హింసను తోసిపుచ్చుతూ వర్గ సామరస్యాన్ని పండా కోరుకుంటున్నాడు. విప్లవ హింస అనేది నిజమైన మావోయిస్టులకు నకిలీ మావోయిస్టులకూ

మధ్య విభజన రేఖగా ఉన్న అంశం. ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో ఇది ముఖ్యమైన, కీలకమైన అంశం. పండా లాంటి అదిభౌతికవాద తాత్విక దృష్టి కోణం గల పెటీబూర్జువా నాయకత్వం దృఢత్వాన్ని కోల్పోయి పోరాటంలో వీరు ఊగిసలాటకు గురై, శత్రువుతో రాజీకి అర్రులు చాస్తారు. ఇటువంటి మహాశయులు అవలంబించే ఎత్తుగడలు కూడా గొంతులోతు సంస్కరణవాదంతో కూడుకొని ఉంటాయి. 'రాజ్యాంగ యంత్రం-విప్లవం' అనే గ్రంథంలో కామ్రేడ్ లెనిన్ ఇలా అన్నాడు "ప్రజానీకాన్ని క్రమపద్ధతిలో హింసాయుత విప్లవమనే భావనతో ఉత్తేజితులను చేయడమే మార్క్స్, ఏంగెల్స్‌ల సిద్ధాంతమంతటికీ పునాది". కేవలం సంస్కరణవాద ప్రచారానికే పరిమితమై బిగిలేని నిర్మాణాన్ని కోరుకునే పండా లాంటి అరాచక, ఉదారవాద సెక్టేరియన్లు ఫాసిస్టు సామ్రాజ్యవాద శక్తుల్ని, రోజు రోజుకూ దూకుడుగా దాడులకు దిగే భారత రాజ్యాంగ యంత్రాన్ని ఎదుర్కోజాలరు. సరియైన విప్లవ సిద్ధాంతం కలిగి కేవలం బోల్షివిక్ శైలిలో నిర్మించబడ్డ పార్టీలు మాత్రమే ఈ దాడిని ఎదుర్కొని నిలబడగలవు. పండా లాంటి దిగజారుడుగాళ్లు బూర్జువావర్గ రాజకీయ ప్రవాహంలో కలిసిపోతారు.

మితవాద అవకాశవాద సి.పి.ఐ. (ఎం-ఎల్) లిబరేషన్ పార్టీని వదిలి విప్లవ పంథాను ఆమోదించి మా పార్టీలో చేరి, ఐక్యతా కాంగ్రెస్ పంథాను ఆమోదించిన పండాకు పార్టీ పంథా తెలియదనుకోలేం. అయితే పండా పార్టీ నుండి తనను తాను వేరుపరుచుకోవాలని అనుకున్నాడు. కాబట్టి అవకాశవాదంతో మావోయిస్టులది మతిలేని హింస అని, అమాయక ప్రజలను చంపుతున్నారనీ విషం కక్కుతూ తాను వీటన్నింటినీ వ్యతిరేకిస్తున్నట్టుగా చూపించుకోవడానికి తాపత్రయపడుతూ తద్వారా భారత రాజ్యం దయాదాక్షిణ్యాలకు, కరుణాకటాక్షాలకు అర్రులు చాస్తున్నాడు. ప్రజలను నానారకాలుగా హింసిస్తూ, వారి జీవితాలను సకల పార్శ్వాల్లో నాశనం చేస్తూ, హత్యలు చేస్తున్న ప్రభుత్వ సాయుధ బలగాలు, అధికారులూ, లక్ష్మణానంద, జగబంధు లాంటి వర్గశత్రువులు అతనికి యిప్పుడు హఠాత్తుగా అమాయకులుగా కన్పిస్తున్నారు. పాలకవర్గాల పాదాల వద్ద మోకరిల్లడానికి అతను స్వామిని మించిన స్వామిభక్తిని ప్రదర్శిస్తూ అబద్ధపు కూతలతో శత్రు దుష్ప్రచారాన్ని తలదన్నుతున్నాడు.

పండా 13 యేండ్ల కాలం నుండి ఒక విప్లవ పార్టీలో పనిచేసినప్పటికీ దాని పంథా మరియు వ్యూహం-ఎత్తుగడలను తానెప్పుడూ బుర్రకెక్కించుకోలేదు. తన పాత మితవాద అవకాశవాద [సి.పి.ఐ. (ఎం-ఎల్) లిబరేషన్, రివిజనిస్టు సి.పి.ఎం.] భావాలను బుర్ర నుండి వదిలించుకోలేదు. అందుకనే తనకు 'వర్గ శత్రునిర్మూలన', 'సాయుధ పోరాటం' అనే పదాలు అంటేనే తేళ్లు, జెర్రులు పాకినట్లు అవుతున్నది. దోపిడీ పాలకులు అనుక్షణం హింసకు పాల్పడుతూ పీడిత ప్రజల రక్తాన్ని ఏరుల్లా పారిస్తూ వాళ్ల శ్రమను, ప్రకృతి సంపదల్ని కాజేయడానికి ఫాసిస్టు పాలనను అమలు జరుపుతుంటే పండా కంటికి అది ఏ మాత్రం హింసగా కనపించదు. ఒక్కమారు కూడా దీని గురించి మాట్లాడడు. దీనికి ప్రతిగా జరుగుతున్న విప్లవ హింస గురించి

మాత్రం గావుకేకలు వేస్తున్నాడు. సల్వాజుడుం, శాంతి సేనల సృష్టికి మావోయిస్టుల విధానాలనే కారణంగా నిందించే పండా లాంటి మిత్రులు ఈ దోపిడీ ప్రభుత్వానికి చాలా అవసరం. ఇద్దరి గొంతులూ ఏకమై ఈ విషయంలో ఐక్యంగా పనిచేయడం సహజమే మరి.

మనం దోపిడీ వర్గ సమాజంలో నివసిస్తున్నామనీ, వర్గ యుద్ధం ద్వారా తప్ప దాని నుంచి పీడిత ప్రజలు విముక్తి అయ్యే మార్గం లేదని  వర్గ సామాజిక చరిత్రంతా యిప్పటికే రుజువుపరిచింది.

సాయుధ పోరాట ఆవశ్యకత గురించి, ప్రజాసంఘాలు, ప్రజా ఉద్యమం గురించి, ప్రజా పోరాటానికి సాయుధ పోరాటానికి మధ్య గల సంబంధం గురించి, మా ''భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు'' డాక్యుమెంటు ఏం చెబుతున్నదో ఈ సందర్భంగా ఒకసారి చూద్దాం.

''... రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి గాను పీడిత ప్రజల చేతుల్లో ఉండే సాధనమే ప్రజాసైన్యం. ప్రజాసైన్యం లేకుండా దోపిడీ వర్గాల రాజ్య యంత్రాంగాన్ని ధ్వంసం చేయడం అసాధ్యం. అందువలన దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను అనుసరించే విప్లవోద్యమంలో కార్మికవర్గ పార్టీ ప్రజాసైన్యాన్ని నిర్మించి అభివృద్ధిపరచడానికి చేసే కృషికి కీలకమైన ప్రాధాన్యత ఉంటుంది.

''మన దేశం వంటి దేశాల్లో విప్లవం మొట్టమొదటి నుండి ప్రధానంగా సాయుధ పోరాట రూపం ద్వారా సాగుతుంది. నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమమంతటా సాయుధ పోరాటం లేదా యుద్ధం ప్రధాన పోరాట రూపంగా ఉంటుంది. ప్రజలను సంఘటితపరిచే కృషి గానీ, ప్రజా పోరాటాలను నిర్మించే కృషి గానీ ప్రజా సాయుధ బలగాల మద్దతు లేకుండా ప్రజా పోరాటాలను నిర్మించే కృషి గానీ ప్రజా సాయుధ బలగాల మద్దతు లేకుండా విజయవంతంగా సాగదు. గెరిల్లా యుద్ధాన్ని విస్తరించి, అభివృద్ధిపరచడం ద్వారా మాత్రమే పార్టీ ప్రజా పోరాటాల ద్వారా లభించిన విజయాలను సుసంఘటితపరుచుకోగలుగుతుంది. ఆ విధంగా మాత్రమే అది ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ అధికారానికి పునాదిని వేయగలుగుతుంది.''

''ప్రజాసైన్యమంటే రాజకీయ కర్తవ్యాలను అమలు చేయడానికి ఉన్న సాయుధ నిర్మాణం. ప్రజాసైన్యం తన సొంత బలాన్ని పరిరక్షించుకుంటూ శత్రువును నాశనం చేయడం కోసం పోరాడుతూనే ప్రజలలో ప్రచారాన్ని సాగించడం, ప్రజలను సంఘటితపరచడంతో పాటు సమీకరించడం, సాయుధం చేయడం విప్లవ రాజకీయ అధికారాన్ని నెలకొల్పడానికి వారికి సహాయపడటం, పార్టీ నిర్మాణాలను నెలకొల్పి అభివృద్ధిపర్చడం, ఉత్పత్తిలో పాల్గొనడం వంటి కర్తవ్యాలను కూడా చేపడుతుంది. ఈ లక్ష్యాలు కొరవడినట్లయితే పోరాటానికి అర్థం ఉండదని, ఎర్రసైన్యం దాని అస్తిత్వానికి ఉన్న ప్రాధాన్యతను కోల్పోతుందని కామ్రేడ్ మావో చెప్పాడు.''

''... రివిజనిస్టులు నాయకత్వం వహించే ప్రజా ఉద్యమాలతోనూ, ప్రజాసంఘాలతోనూ స్పష్టమైన విభజన రేఖను గీసుకోవడం అత్యంత అవశ్యకం. భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితి

దృష్ట్యా మన ప్రజా ఉద్యమం, ప్రజాసంఘాల ఓరియంటేషన్ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహానికి అనుగుణంగా ఉంటుంది.”

“... ప్రజారాశులను రాజకీయంగా జాగృతం చేసి, వారిలో సాయుధ మార్గం ద్వారా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న విప్లవకర రాజకీయాలను వారికి రంగరించిపోయడం అన్నది ప్రజాసంఘాలలో ఉండే పార్టీ అతి ముఖ్య కర్తవ్యంగా ఉంటుంది.”

“ప్రజాసంఘాల, ప్రజా పోరాటాల ప్రాముఖ్యతను గుర్తిస్తూనే మనం మొత్తం విప్లవంలో యుద్ధం లేదా రాజ్య వ్యతిరేక సాయుధ పోరాటమే ప్రధాన పోరాట రూపం గానూ, సైన్యం ప్రధాన నిర్మాణ రూపం గానూ ఉంటాయని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.”

కామ్రేడ్ మావో యిలా సూచించాడు... “యుద్ధం ప్రధాన పోరాట రూపం, సైన్యం ప్రధాన నిర్మాణ రూపం. ప్రజాసంఘాలు, ప్రజా పోరాటాలు వంటి యితర రూపాలు కూడా అత్యంత ప్రాముఖ్యత కలిగినవి, ఆవశ్యకమైనవి అన్నది నిజమే, ఎలాంటి పరిస్థితులలోనూ వాటిని విస్మరించరాదు. అయితే వాటి లక్ష్యం యుద్ధానికి దోహదం చేయడమే. యుద్ధం మొదలు కావడానికి ముందు మొత్తం నిర్మాణాలు పోరాటం యుద్ధానికి సన్నాహాల కోసమే. యుద్ధం మొదలయ్యాక అన్ని నిర్మాణాలు, పోరాటాలూ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ యుద్ధంతో సమన్వయించబడతాయి.

“మొట్టమొదటి నుండి ప్రజాసంఘాలను, ప్రజా పోరాటాలను నిర్మించడానికి సంబంధించిన మన ఓరియంటేషన్ పర్‌స్పెక్టివ్ పద్ధతి యుద్ధానికి ప్రత్యక్షం గానో, పరోక్షం గానో సేవ చేసేలా ఉండాలి అని దాని అర్థం. అలాంటి పర్‌స్పెక్టివ్ లేకుండా నిర్మించిన ప్రజాసంఘాలు విప్లవాన్ని పురోగమింపజేయడానికి పనికి రావు ఇక్కడ ప్రజా పోరాటాలను, ప్రజాసంఘాలను క్రమ క్రమంగా సాయుధ పోరాటంగా పరివర్తన చెందించటం అనే అభిప్రాయాన్ని తప్పుడు అభిప్రాయంగా గుర్తించాలి.

“ఈ దిశను కోల్పోయినట్లయితే మన ప్రజాసంఘాలు, ప్రజా పోరాటాలు లీగలిజంలోకి ఆర్థికవాదంలోకి కూరుకుపోతాయి. మనం ప్రజలను రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సంసిద్ధం చేయలేం. మితవాద అవకాశవాదానికి, రివిజనిజానికి మూలం యిందులోనే ఉంది. అందువలన సాయుధ పోరాటం, యితర రూపాలలోని పోరాటాలు రెండూ కూడా తప్పనిసరి. అయితే ప్రధానమైన, నిర్ణయాత్మకమైన రూపం సాయుధ పోరాటమే.”

ఆధునిక రివిజనిస్టు రూపం ఎత్తిన పండాకు వీటితో వేటితోనూ పట్టింపు లేదు. దోపిడీ రాజ్యాన్ని కూల్చడానికి, ప్రజల అధికారాన్ని స్థాపించడానికి రాజ్యం నుంచి ఎదురయ్యే అణచివేత క్యాంపెయిన్లను ఎదుర్కోవడానికి కావల్సిన బలప్రయోగం యొక్క అవసరం గురించి పండా దృష్టిలో ఎలాంటి ప్రత్యేకతా లేదు. అందుకే బాసధార ఉద్యమంలో శాంతిసేన నాయకుడైన

ధాకు మాజీని నిర్మూలించిన ఘటనకు గానీ, డికెలో సల్వాజుడుం అభియాన్‌ను ఓడించడంలో పిఎల్‌జిఏ నిర్వహించిన సాహసోపేతమైన పాత్రకు గానీ పండా దృష్టిలో విలువ ఉండదు.

ఈ సందర్భంగా పండాకు ఒక విషయాన్ని మనం స్పష్టం చేయాలి. గుడారి, కళింగ నగర్, లాల్‌గఢ్ మరియు నారాయణపట్నా ఉద్యమాలను సమీక్షించి వాటి నుంచి సరైన గుణపాఠాలను తీయాలనే విషయంలో మాకు భిన్నాభిప్రాయం లేదు. అయితే ఇందులో పండాకు మనకూ మధ్య ఉండే ఒక స్పష్టమైన తేడా, విభజన రేఖ ఏంటంటే అది ప్రజాయుద్ధ ఓరియంటేషన్ విషయంలోనే. ఆయా పోరాటాలలో నిర్దిష్టంగా కదిలిన ప్రజల్ని మరింతగా రాజ్య వ్యతిరేక పోరాటాల్లోకి సమీకరించలేకపోవడానికి గల మా బలహీనతలపై ఇప్పటికే మా సమీక్షలు ఉన్నాయి. నిర్మాణ రూపాలు, పోరాట రూపాల విషయంలో ప్రజల స్థాయిని మరింత పెంచడానికి బదులుగా, పండా మాట్లాడుతున్నట్లుగా పార్టీ స్థాయినే ప్రజల చైతన్య స్థితికి కుదించడమనేది నిర్ద్వంద్వంగా ప్రజల తోక పట్టుకుపోవడమే, మితవాద అవకాశవాదమే, రివిజనిజమే.

అందుకనే ప్రజాసంఘాలకు ఎంఎల్ఎం సిద్ధాంతాన్నీ, ఎన్‌డిఆర్ లక్ష్యాన్ని అంటగట్టామని, ఎన్నికల బహిష్కరణను జోడించామని దాని మూలంగా అవి ప్రభుత్వ నిర్బంధానికి, దాడికి గురై దెబ్బతింటున్నాయనీ, వెరసి ఉద్యమాలన్నీ మా దుందుడుకు విధానాల వల్లనే వెనకపట్టు పట్టాయంటున్నాడు. దీనికి ప్రత్యామ్నాయంగా పండా ప్రతిపాదిస్తున్న కొత్త పాలసీ పండా మాటల్లోనే ... "దళం ఉంటుంది గానీ రహస్యంగా ఉంటుంది. ప్రజల్లోకి వెళ్లదు. సింగిల్ ఆర్గనైజర్లు ప్రజల్లోకి వెళతారు. ప్రజల్ని ఆర్గనైజ్ చేస్తారు. ఇన్‌ఫార్మర్లపై, స్టేట్‌పై దాడులు చెయ్యం. అలా చేస్తే నిర్బంధం వస్తుంది."

ప్రజాసైన్యమంటే రాజకీయ కర్తవ్యాలను సాధించడానికి అవసరమైన సాయుధ నిర్మాణం అనే మావోయిస్టు అవగాహనతో పండా దళ నిర్మాణానికి ఎలాంటి సంబంధం లేదు. వాటిని చూపెట్టి డబ్బులు దండుకోవడానికీ, ఎన్నికల్లో ప్రత్యర్థులను బెదిరించి దళాలు తప్పనిసరిగా ప్రజా పీడిక అరాచక మూకలుగా మారటం తథ్యం.

## 4. ఒడిశా రాష్ట్ర ఉద్యమం పట్ల మావోయిస్టు పార్టీకి సరైన వైఖరి లేదు అనే విమర్శపై

దీని నిజానిజాలపై సరైన నిర్ధారణలకు రావడానికి సంక్షిప్తంగా పార్టీ నుంచి జరిగిన కృషిని, కేంద్రీకరణను ఈ మొత్తం కృషిలో పండా పాత్ర ఎలాంటిదనేది చూడడం అవసరం.

1970లలో భారత విప్లవోద్యమం దేశవ్యాప్తంగా తీవ్ర శత్రు నిర్బంధంలో నష్టాలు పొంది అమరత్వాలు, అరెస్టులు, మితవాద అవకాశవాదుల, విచ్ఛిన్నకుల కుట్రల మూలంగా దేశవ్యాప్త పార్టీ, దాన్ని నడిపించే ఉన్నత కమిటీ (సి.సి.) ఉనికిలో లేని స్థితి ఏర్పడింది. ఎక్కడికక్కడ మిగిలిన నిజమైన విప్లవ శక్తులు గత అనుభవాల నుంచి నేర్చుకుంటూ తిరిగి ఉద్యమాలను అభివృద్ధిపరచడానికి కృషి చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో విప్లవోద్యమం పెంపొందుతూ

దేశంలోని వివిధ ప్రాంతాలలో సంఘటితపడుతూ, విస్తరిస్తూ మూడు ప్రధాన విప్లవ స్రవంతులుగా (ఎంసిసిఐ, సిపిఐ (ఎం-ఎల్) పియు, సిపిఐ (మా-లె) (పిడబ్ల్యు) రూపొందాయి. ఈ క్రమంలో అవీ, మరి కొన్ని నిజమైన విప్లవ శక్తులు తిరిగి బలమైన దేశవ్యాప్త పార్టీగా ఐక్యం కావాలనే లక్ష్యంతో లోతైన చర్చల ద్వారా సిద్ధాంత రాజకీయ, నిర్మాణపర ఐక్యతను సాధిస్తూ చివరికి సిపిఐ (మావోయిస్టు) ఉనికిలోకి వచ్చింది. 2001లో జరిగిన మునుపటి సిపిఐ (ఎం-ఎల్) (పిడబ్ల్యు) 9వ కాంగ్రెస్, 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్‌లు విజయవంతమై ఆచరణను, అనుభవాలను మదింపు చేసుకొని సిద్ధాంతాన్ని, రాజకీయ, మిలటరీ, నిర్మాణ పంథాను మౌలిక డాక్యుమెంట్లను మరింతగా పరిపుష్టం చేశాయి.

ఈ మొత్తం కృషిలో పీపుల్స్‌వార్ పార్టీ, ఎంసిసి పార్టీ పెరుగుతున్న తమ స్వీయాత్మక శక్తుల పైనా, నూతన విప్లవ శక్తుల సంబంధాల పైనా ఆధారపడుతూ ఒడిశా రాష్ట్ర ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తూ వచ్చాయి. సి.పి.ఐ. (మావోయిస్టు) ఐక్యతా కాంగ్రెస్ డికె, బిజె ఉద్యమాలను విముక్తి ప్రాంతాలుగా, పిఎల్‌జిఏను పిఎల్‌ఏగా, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేయాలనే కేంద్ర కర్తవ్యాన్ని రూపొందించిన నేపథ్యంలో పై రెండు వ్యూహాత్మక ఉద్యమ ప్రాంతాలకు కూడలిగా ఒడిశా రాష్ట్రం ఉండడం వల్లనూ, ఈ రాష్ట్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ, భౌగోళిక స్థితి మూలంగానూ ఈ ఉద్యమానికి మరింత వ్యూహాత్మక ప్రాధాన్యత ఉందన్న విషయం పార్టీ కేంద్రకమిటీ గమనంలో ఉంచుకునే ఇక్కడి ఉ ద్యమాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చింది.

శ్రీకాకుళం ఉద్యమ అభివృద్ధిలో భాగంగా అవిభక్త కోరాపుట్ జిల్లాలోకి ఉద్యమం విస్తరించింది. నక్సల్బరీ విప్లవ రైతాంగ సాయుధ పోరాట ప్రభావం వల్ల సిపిఐ, సిపిఐ (ఎం) నుండి విప్లవ శక్తులు చీలి సిపిఐ (ఎం-ఎల్)లో భాగమైనాయి. ఆనాడు ఒడిశాలోని కొన్ని గ్రామీణ ప్రాంతాలలో, పట్టణాలలో విప్లవ శక్తులు పనిజేశాయి. అయితే దేశవ్యాప్త శత్రు దాడిలో భాగంగా ఒడిశాలోనూ తీవ్ర నిర్బంధంలో విప్లవ శక్తులు చాలా వరకు దెబ్బతిన్నాయి. మిగిలిన శక్తులకు ప్రాతినిధ్యం వహించిన నాయకత్వం మితవాద అవకాశవాద పంథా చేపట్టడం, చీలికలకు గురై ప్రభావహీనమైపోయాయి. ఆ తర్వాత మునుపటి సిపిఐ (ఎం-ఎల్) (పిడబ్ల్యు) 1985 నుండి అవిభక్త కోరాపుట్ జిల్లాలో ఉద్యమాన్ని ప్రారంభించింది. అలాగే శ్రీకాకుళ ఉద్యమం తిరిగి పునరుద్ధరణలో భాగంగా గంజాం, రాయగడ ప్రాంతాలలో ఉద్యమం ప్రారంభమయ్యింది. ఒడిశాలో అభివృద్ధి చెందుతున్న ఉద్యమ ప్రభావంతో పండా 1995 నుండి బాసధార గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తూ వచ్చాడు. కానీ ముందు మునుపటి సిపిఐ (ఎం-ఎల్) (పియు) సంబంధాల్లోకి వచ్చిన పండా పిఆర్‌గా ఒక్కడే ఈ ఏరియా నుంచి 1998లో మునుపటి సిపిఐ (ఎం-ఎల్) (పిడబ్ల్యు)లో భాగమయ్యాడు. బాసధార ఉద్యమ అవసరాలను, ఈ రాష్ట్ర సరిహద్దుల్లోని ఉద్యమ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పార్టీ ఇతర

రాష్ట్రాల నుండి నాయకత్వాన్ని, క్యాడర్లను అక్కడికి పంపుతూ వచ్చింది. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రంలో ఉద్యమాన్ని అభివృద్ధి చేసే పర్‌స్పెక్టివ్‌లో ఒక భాగంగానే ఆనాటి స్థితిలో పరిమిత శక్తులు ఉండటం వల్ల 2002లో సిసి నిర్ణయం మేరకు బాసధార ప్రాంతం ఏఓబి ఉద్యమంలో భాగమై ఏరియా స్థాయిలో ఉన్న ఉద్యమం క్రమంగా డివిజన్ స్థాయి ఉద్యమంగా అభివృద్ధి చెందింది.

మునుపటి ఎంసిసిఐ ఒడిశాలోకి ఉద్యమాన్ని విస్తరింపజేయటానికి మొదట కటక్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల్లో పని ప్రారంభించింది. ఈ జిల్లా ల్లో తయారైన కొంతమంది పిఆర్‌లను వ్యూహాత్మక దృష్టితో నవపాడ, బొలంగీర్ ప్రాంతాల్లో పని ప్రారంభించడానికి పంపడమైంది. ఆ తర్వాత కాలంలో సంబల్‌పూర్, దేవ్‌గఢ్, సుందర్‌గఢ్, కేంఝోర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో పని ప్రారంభమైంది. సంబల్‌పూర్, దేవ్‌గఢ్ ప్రాంతంలో వర్గ పోరాటంలో భాగంగా కొందరు వర్గ శత్రువులను నిర్మూలించి, శత్రువు నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడమైంది. ఈ రకంగా ఇక్కడ ఉద్యమం మైదానాలకు, అటవీ ప్రాంతాలకు విస్తరించింది. రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ పనిచేస్తూ దీని కింద సంబల్‌పూర్–దేవ్‌గఢ్–సుందర్‌గఢ్ (ఎస్‌డిఎస్) జోనల్ కమిటీ, కటక్–జగత్‌సింగ్‌పూర్ జిల్లా కమిటీలు, కొన్ని ఏరియా కమిటీలు ఉండినాయి.

2004లో మావోయిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత ఒడిశా రాష్ట్రంలోని మునుపటి రెండు పార్టీల నాయకత్వం కింద వేరు వేరుగా ఉన్న పార్టీ శక్తులను, ఉద్యమాలను సమైక్యం చేస్తూ ప్రత్యేకంగా ఒక రాష్ట్ర స్థాయి ఉద్యమంగా అభివృద్ధి చేయడంలో భాగంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ (ఎస్ఓసి)ని ఏర్పరచడం జరిగింది. ఆ తర్వాత కళింగనగర్ డివిజనల్ కమిటీ, కంధమాల్–గంజాం డివిజనల్ కమిటీ, నియమగిరి డివిజనల్ కమిటీల కింది ఉద్యమాలు అభివృద్ధి అయ్యాయి. అలాగే ఉద్యమం ఎదుగుదలకు, అవసరాలకు తగ్గ విధంగా ఒడిశా రాష్ట్ర సరిహద్దున ఉన్న రాష్ట్రాలలో ఏఓబి (రాష్ట్ర స్థాయి), బెంగాల్ రాష్ట్ర కమిటీ నాయకత్వం కింద బిజెఓ (రీజియన్ స్థాయి) ఉద్యమాలకు తోడుగా, ఆ తర్వాత సిఓబి ప్రాంతంలో మరో రాష్ట్ర ఉద్యమాన్ని పార్టీ అభివృద్ధి చేసింది. ఈ ఉద్యమాలన్నీ ఒడిశా రాష్ట్రంలోని విప్లవోద్యమాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి.

ఈ క్రమంలోనే పండా పార్టీలో డివిజన్ కమిటీ స్థాయి నుంచి ఎస్ఓసి కార్యదర్శి దాక ఎదిగాడు. ఒడిశా ఉద్యమానికి ఉన్న ప్రాధాన్యత రీత్యా, తనని అపారంగా గౌరవించడమే కాకుండా పార్టీ పంథాను తాను అర్థం చేసుకోవడానికి వీలుగా మునుపటి సిపిఐ (ఎం–ఎల్) పీపుల్స్‌వార్ 2001లో నిర్వహించిన 9వ కాంగ్రెస్‌కు ప్రతినిధిగా హాజరుపరిచింది. కమిటీ సమావేశాలలోనూ, కార్యాచరణ సందర్భాలలోనూ నాయకత్వం తనతో ఓపికగా చర్చించడంతో పాటు తన నుంచి ఫంక్షనింగ్‌లో ఎదురవుతున్న లోపాలను, అన్యవర్గ ధోరణులను ఎంతో

సంయమనంతో సరిదిద్దడానికి ప్రయత్నించింది.

పండా తనకున్న సంకుచిత ప్రాంతీయవాద దృష్టి వల్ల వేరే కామ్రేడ్స్ వచ్చి ఒడిశాలో పనిచేయడాన్ని ఎన్నడూ సరిగా జీర్ణించుకోలేదు. ఆ కామ్రేడ్స్ నిస్వార్థాన్ని మెచ్చుకోవడానికి బదులుగా అతను వారికి ఒడిశా కామ్రేడ్స్‌కు మధ్య విభేదాలు సృష్టించడానికి ముతాకోరు పద్ధతులలో నిరంతరం ప్రయత్నించాడు. ఉద్యమ అవసరాల రీత్యా ఇతర రాష్ట్రాల నుండి ఒడిశాలో పనిచేయడానికి వచ్చిన వివిధ కమిటీలలోని కామ్రేడ్స్ విషయంలో అతను ప్రాంతీయ దురహంకారాన్ని, పెత్తందారీతనాన్ని ప్రదర్శిస్తూ, అప్రజాస్వామికంగా, సెక్టేరియన్‌గా, వివక్షతతో వ్యవహరిస్తూ వచ్చాడు. ఈ పద్ధతుల మూలంగా పండాకీ, ఇతరులకీ మధ్యన కామ్రేడ్లీ సంబంధాలు, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం, సహకరించుకోవడం అనేది సవ్యంగా ఎన్నడూ సాగలేదు. ఇది కమిటీ ఫంక్షనింగ్‌కు తీవ్ర ఆటంకంగా ఉంటూ ఒడిశా ఉద్యమానికి తీవ్ర నష్టాన్ని కలిగించింది.

2002లో బాసధార ఉద్యమాన్ని తాత్కాలికంగా ఏఓబిలో భాగం చేయడం పండాకు ససేమిరా ఇష్టం లేదు. ఇది చివరి వరకూ మింగుడుపడని విషయంగానే ఉంటూ వచ్చింది. తాను మితవాద అవకాశవాద లిబరేషన్ పార్టీని వదిలి మావోయిస్టు పార్టీతో ఐక్యమయ్యేదే గానీ, తన భావాలు మావోయిస్టు పద్ధతులు, పాలసీల విషయంలో పార్టీ డాక్యుమెంట్లు, సూత్రాల కనుగుణంగా విప్లవకరంగా ఎన్నడూ మార్చుకోలేదు. మితవాద దృష్టి కోణం నుండే ప్రతీదాన్ని చూడటం మూలంగా కార్యాచరణలో ప్రతీ సందర్భంలో తనకీ యితర కామ్రేడ్స్‌కూ మధ్య భావాలలో వైరుధ్యం కొనసాగుతూనే వచ్చింది. కనీసం మెజారిటీకి మైనారిటీ లోబడి ఉండే కేంద్రీకృత ప్రజాస్మామిక నిర్మాణ సూత్రానికైనా కట్టుబడి పనిచేస్తాడా అంటే అదీ ఉండదు. వ్యక్తివాదంతో తన బుర్రకు తోచిన దాన్ని ఆచరించే అతిప్రజాస్వామిక వైఖరిని కొనసాగిస్తూ వచ్చాడు.

కార్మికవర్గ దృష్టి కొరవడడం, కష్టపడేతత్వం, త్యాగ సంసిద్ధత లేకపోవడంతో పండా పని ఎప్పుడూ పైపై ఆచరణగానే సాగుతూ వచ్చింది. తీవ్ర వర్గ పోరాటంలోకి తను ఎప్పుడూ దిగలేదు. తనలోని రివిజనిస్టు పద్ధతుల మూలంగా ఒకరికి మరొకరికి మధ్య చిచ్చుపెట్టడం, లేని వైరుధ్యాన్ని సృష్టించడం, చివరికి సమస్యను పెద్దది చేయడం, విభజించు–పాలించు విధానంతో తన పబ్బం గడుపుకోవడం, తనకు అనుకూలంగా ఉండేవారి పట్ల ఒకలాగా, ఇతరుల పట్ల వేరొకలాగా (పక్షపాత దృష్టి) ప్రవర్తించడం అనేవి తనలో సాధారణ విషయాలుగా ఉంటూ వచ్చాయి. అయితే పండా ప్రత్యేకత ఏంటంటే తనకున్న జబ్బులన్నీ ఇతరులకు అంటగట్టడం. తనకున్న సంకుచిత ప్రాంతీయ దురహంకారాన్ని ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఒడిశాలో పనిచేస్తుండిన కామ్రేడ్స్ (తెలుగు, కోయ, బెంగాలీ కామ్రేడ్స్) పట్ల వ్యతిరేకత,

ద్వేషాన్ని ప్రదర్శించాడు. ఒడిశా కామ్రేడ్స్‌ని, స్థానిక కువ్వి కామ్రేడ్స్‌ని ఇతరులే చిన్నచూపు చూస్తున్నారనే వాదనలు ముందుకు తెస్తూ వచ్చాడు.

ఆఖరికి పండా ఎంత నీచానికి దిగజారాడంటే బాసధార ఉద్యమమంతా, ఏఓబి నాయకత్వం ఇచ్చిన గైడెన్స్ మూలంగానే నష్టపోయిందనీ, మొత్తంగా ఒడిశా ఉద్యమమంతా ఏఓబి, బిజెఓ, సిఓబి కమిటీల దుందుడుకు చర్యల మూలంగానే దెబ్బతిన్నదనీ, చివరికి తనపై జరిగిన రెండు ఎన్‌కౌంటర్ ఘటనలు, తెలుగు నాయకత్వమైన బికె, మనోజ్‌లు ఇతరత్రా తెలుగు వాళ్లు చేసిన తప్పుల మూలంగానే జరిగాయని చిత్రీకరించాడు. శత్రువుతో పూర్తిగా చేతులు కలిపి పార్టీ నాయకత్వాన్ని మరియు ఒడిశా ఉద్యమానికి తీవ్రంగా హానిచేసే లక్ష్యంతో కోవర్టులుగా మారిన సుశాంత్, రవిలు తనకు అనుకూలంగా ఉండడం వల్ల వెనకేసుకొచ్చాడు. మునుపటి సిపిఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)లోనూ, ఆ తర్వాత సిపిఐ (మావోయిస్టు)లోనూ పండా ఫార్మల్‌గా ఐక్యమైనప్పటికీ నిజాయితీగా ఐక్యమై పని చేయడానికి ఎప్పుడూ ప్రాముఖ్యత నివ్వలేదు. గొంతులోతు గ్రూపిజంతో పక్షపాత వైఖరితో ఎడతెగని తగువులతో, తన స్వార్థం కోసం ఎప్పుడు ఎవరితో ఐక్యం అవుతాడో, ఎప్పుడు ఎవరితో కూటమి కడతాడో, ఎప్పుడు ఎవరిపై దాడికి దిగుతాడో అర్థం చేసుకోవడం కష్టం. ఎందుకంటే, ఆయన మాటల్లో నీతులు వల్లిస్తూ, తన కుటిలత్వాన్ని బయటపడకుండా జాగ్రత్తపడుతుంటాడు.

పియు కేడర్ అయినందుకే కామ్రేడ్ సిత్రు పట్ల ఒంటెత్తు పద్ధతుల్లో ఏఓబి కామ్రేడ్స్ వ్యవహరించారనీ, ఫలితంగా ఆయన శత్రుదాడిలో ప్రాణాలు కోల్పోయాడనీ, నేడు తన విషయంలో అదే జరుగుతుందనీ, కామ్రేడ్స్ విజయ్‌దా, సుమిత్‌దాలు గతంలో పియు నాయకత్వం అయినందునే ప్రస్తుత నాయకత్వం వారిపై నీచంగా, చులకనగా మాట్లాడుతున్నారనీ అంటూ పార్టీ అగ్ర నాయకత్వం (సిసిఎంల) మధ్య వైరుధ్యాల్ని సృష్టించేందుకు అపర చాణక్య నీతిని ప్రదర్శించాడు.

కాని వాస్తవాలు ఏమిటి? పార్టీ వైపు నుంచి ఎన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ కామ్రేడ్ సిత్రు పార్టీ నిర్మాణ పద్ధతులలో ఇమడలేని పరిస్థితులలో ఆయనపై హెచ్చరిక, సస్పెన్షన్, డిమోట్ తీర్మానాలు పార్టీ చేయాల్సి వచ్చింది. చివరకు ఏ నిర్మాణంలోనూ ఇమడలేని పరిస్థితుల్లో ఆయనను జంజావతి ఏరియాలో ఉండి పనిచేయాలని పార్టీ సూచించింది. తన రక్షణకు ఒక ఆయుధాన్ని కూడా అందించింది. తన తప్పుల నుండి బయటపడుతున్న క్రమంలో తన పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది. అంతే తప్ప పి.యు. కేడర్ అని ఆయన పట్ల ఏఓబి కామ్రేడ్స్ తప్పుగా వ్యవహరించింది ఎన్నడూ లేదు. అబద్ధాలను గుది గుచ్చటంలో నిపుణుడు అయిన పండా, బంధుగావ్ ఏరియాలో జరిగిన భూ పోరాటాలతో ఏమాత్రం సంబంధంలేని కామ్రేడ్ సిత్రునే ఆ పోరాటాలను నిర్మించాడని మరో అబద్ధాన్ని అల్లాడు. కామ్రేడ్ సిత్రు కేవలం ఆ

ప్రాంతానికి షెల్టర్ తీసుకోవడానికి మాత్రమే వచ్చాడు. ఒక ఇన్‌ఫార్మర్ అందించిన సమాచారంతో పోలీసులు గ్రామాన్ని చుట్టిముట్టి చేసిన దాడిలో కామ్రేడ్ సిత్రు, ఆయన సహచరి అమరులయ్యారు. తర్వాత ఆ ఇన్‌ఫార్మర్‌ను పార్టీ ఖతం చేయడం జరిగింది. ఈ వాస్తవాలను వేటిని పండా చెప్పడు. ఎందుకంటే, గతంలో పి.యు. నాయకత్వంతో సంబంధాలుండిన, ఆ తర్వాత క్రమంలో ప్రస్తుత నాయకత్వం పట్ల అసంతృప్తి పెంచుకుని పార్టీ నుంచి దిగజారిన కొందరిని అవకాశవాద పద్ధతుల్లో కూడ గట్టి మరో పొయ్యి పెట్టుకునేందుకు పథకం ప్రకారమే ఇలాంటి అబద్ధాలను పండా ప్రచారం చేస్తున్నాడు.

అలాగే సిసిలో పి.యు., పి.డబ్ల్యు., ఎం.సి.సి.ఐ. అనే బేధాలతో ఒకరినొకరు నీచంగా, చులకనగా మాట్లాడకోవటం అనేది ఎన్నడూ లేదు. పార్టీతో సన్నిహిత సంబంధం ఉన్నవారెవరూ ఇలాంటి దిగజారుడు విమర్శకు తెగించరు. కానీ, విప్లవ ప్రతిఘాతుకుడిగా మారిన పండా పార్టీ ఉన్నత నాయకత్వాన్ని టార్గెట్ చేసి పార్టీలో ఆ నాయకత్వం పట్ల ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయటానికి ఒక కుట్రపూరిత పథకంలో భాగంగా ఈ స్థాయికి దిగజారి అంతూపొంతూ లేని అబద్ధాలతో విషం కక్కుతున్నాడు. నిజానికి ఒడిశా పార్టీ పత్రికను సరిగ్గా నడిపించే ఉద్దేశ్యంతో పత్రిక సంపాదక వర్గానికి సిసి వైపు నుంచి ఇచ్చిన గైడెన్స్ పండాకు మింగుడు పడలేదు. సంపాదకవర్గ సభ్యురాలిగా ఉన్న ఆయన సహచరి మిల్లీ పండాను రహస్యం పేరుతో సంపాదక మండలి సమావేశాలకు రానీయకుండా చేస్తున్న పండా పని విధానాన్ని సిసి విమర్శించింది. కామ్రేడ్ విజయ్‌దా తమను ఈ విధంగానే గైడ్ చేశాడని, ఆమెను రహస్యంగా ఉండాలని చెప్పి తన తప్పును సమర్థించుకునేందుకు పండా ప్రయత్నించాడు. ఆమెకు ఉద్యమంతో ఏ విధంగానూ ప్రత్యక్ష సంబంధం లేకుండా వర్గ పోరాటం నుంచి పూర్తిగా దూరం చేయడం, ఆమెను కేవలం హౌస్‌వైఫ్‌గా పరిమితం చేయడం సరికాదని, ఫీల్డ్‌లో సంపాదక మండలి సమావేశాలు వేయాలని, దాని వల్ల రహస్యానికి ఎలాంటి భంగం కలగదని సిసి వైపు నుంచి ఇచ్చిన సలహాలు పాటించనందుకు చేసిన విమర్శలను మాటవరసకు ఆనాడు పండా ఆత్మవిమర్శ చేసుకున్నప్పటికీ, నేడు అవకాశవాదంతో కట్టుకథను అల్లి దాన్ని సిసిఎంల మధ్య వైరుధ్యాలున్నాయంటూ రాశాడు. అలాగే లాల్‌గఢ్‌లో ఒక్క పోలీసును కూడా చంపలేదని సిసి వైపు నుంచి కామెంట్ చేశారనే దాంట్లో కూడా ఏమాత్రం నిజం లేదు. ఈ విధంగా పార్టీ ఉన్నత స్థాయి నాయకత్వంపై విషం కక్కడం అనేది విప్లవ ప్రతిఘాతకులకు తప్ప మరొకరికి సాధ్యం కాదు.

పండా  సిసి నాయకత్వంపై విషం కక్కడం కోసం తన ఉత్తరాలలో అడుగడుగునా ప్రయత్నించడం అనేది ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. నాన్‌లోకల్ కేడర్లు స్థానిక ఒడియా, కువ్వి కేడర్ల అభిప్రాయాలకు ప్రాముఖ్యత నివ్వరనీ, నాన్‌లోకల్ కేడర్లపై స్థానిక కేడర్ల విమర్శలను పాజిటివ్‌గా తీసుకోరనీ; బాసధార ఉద్యమం పట్ల తప్పుడు సమీక్షను రాసి సిసికి

పంపారనీ, బాసధార ఉద్యమం దెబ్బతిందన్న కారణంతోనే అక్కడ పనిచేసే స్థానిక కేడర్లను ప్రమోట్ చేయలేదనీ; నిర్ణయాలలో స్థానిక కేడర్ల అభిప్రాయాలు ప్రతిబింబించలేదనీ ఆరోపించాడు. ఒడిశా రాష్ట్ర ఉద్యమ సమీక్ష ఫైనల్ కాకపోవడానికి పండాదే ప్రధాన బాధ్యత కాగా, ఏఓబి నాయకులు దాన్ని ఆమోదించకపోవడం వల్లనే సమీక్ష తుదిరూపు దిద్దుకోలేదని ఆరోపించాడు. బాసధార, ఎస్‌డిఎస్ డివిజనల్ కాన్ఫరెన్సుల్లోనే ఆయా కమిటీలు ఎన్నికయినప్పటికీ, పార్టీలో ఎన్నికలు జరపకుండానే ప్రమోషన్ ఇవ్వడం ద్వారా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారనీ, ఆ ప్రమోషన్లు కూడా తమకు అనుకూలంగా ఉన్నవారికే ఇస్తారనీ, ప్రమోషన్ల పేరుతో పార్టీలో ఫాసిస్టు ఆర్‌ఎస్‌ఎస్ తరహా ఫ్యూడల్ ప్రజాస్వామ్యం అమలులో ఉందనీ తూలనాడాడు. శత్రు దాడిలో చాలా మంది కామ్రేడ్స్ అమరులైన, రాష్ట్ర ఉద్యమ సమన్వయం దెబ్బతిన్న సంక్లిష్ట పరిస్థితిలో పథకం ప్రకారమే 2012 జనవరిలో ఒడిశా స్పెషల్ ప్లీనంను నిర్వహించగా, హఠాత్తుగా ప్లీనం నిర్వహించారనీ, అందులో రెండు డివిజన్లు పాల్గొనలేదనీ, ఊగిసలాటలో ఉన్నారనే పేరుతో ముగ్గురు ఏసిఎంలను ప్లీనంలో పాల్గొనేందుకు అనుమతించలేదనీ, నాయకత్వం స్థానిక కేడర్లపై సెక్టేరియన్‌గా వ్యవహరిస్తోందనీ అతి నీచమైన ప్రచారానికి లంకించుకున్నాడు. ఇవన్నీ పార్టీకి వ్యతిరేకంగా  పండా చేసిన విప్లవ ప్రతీఘాతక విష ప్రచారంలో భాగమే తప్ప ఇది మరొకటి కాదు.

ప్రస్తుతం పండా సానుభూతిపరులను,  మేధావులను, వివిధ సామాజిక సెక్షన్లయిన ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలు మొదలైన వారినీ పార్టీకి దూరం చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాడు. అందుకనే అతను నియమగిరి లొద్దా సికాక (నియమగిరి ఉద్యమ నాయకుడు) హరిహర కద్రక (న్యూ డెమోక్రసీ)లను పార్టీ చంపబోతోందనీ, క్రిస్టియన్లపై దాడి పథకాన్ని పార్టీ తయారు చేసిందనీ, ఆదివాసీ ముఖ్యులను అందరినీ పార్టీ చంపుతుందనీ అవాస్తవాలన్నింటినీ కుప్పపోసి చేతికి దొరికిన రాయినంతా ఏ ఒక్కటి వదలకుండా పార్టీపై విసురుతూ ప్రయోజనం పొందాలని చూస్తున్నాడు. పండా తిమ్మిని బమ్మి చేయాలని ఎంత ప్రయత్నించినా, ఎంతో కాలం అబద్ధాలను నిజం చేసి ఎవర్నీ నమ్మించలేడు.

క్రిస్టియన్ మైనారిటీ ప్రజల విషయంలో మావోయిస్టు పార్టీ ఆచరణను పరిశీలించేవారికి ఎవరికైనా పండా గోబెల్స్‌ను ఎంత గొప్పగా మించిపోయాడో సులువుగానే అర్థం చేసుకోగలుగుతారు. హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా మత మైనారిటీ ప్రజలను (క్రిస్టియన్లు, ముస్లిములు, సిక్కులు మొదలైనవారు), పీడిత వర్గాలన్నింటినీ – కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గం – ఐక్యపరుస్తూ మా పార్టీ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నది. అందుచేత పార్టీ నాయకత్వం వహిస్తున్న ప్రాంతాలలో మత మైనారిటీ ప్రజలపై హిందూ మతోన్మాద దాడులు ఎక్కడా జరగలేదంటే అతిశయోక్తి కాదు.

అసలు ఎస్ఓసిలో ఆ నిర్ణయం చేసినప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు ఉండి చంపిన తర్వాత 'చంపక ముందే ప్రచారం చేయలేదనే' పేరుతో కుంటిసాకులు వెతుక్కునే పని ఏమొచ్చింది? నిజానికి మతోన్మాది లక్ష్మణానందను చంపడంలో పార్టీలో ఎటువంటి గందరగోళం లేదు. గందరగోళపడిందంతా పండానే. ఫాసిస్టు లక్ష్మణానంద మతోన్మాదానికి వందలాది మంది క్రిస్టియన్లు బలి అయితే చీమ కుట్టినట్లు అయినా లేని పండా, లక్ష్మణానందను చంపిన తర్వాత పాజిటివ్ ఫలితం రావడంతో ఆ పేరంతా తనకే చెందాలని అపర క్రిస్టియన్ రక్షకుడిగా ఫోజులు పెట్టాడు. శభాష్ పండా! హిందూ మతోన్మాది అయిన ఫాసిస్టు లక్ష్మణానందను చంపడం నేడు తప్పెందుకంటున్నావు? నేడు నీవు విప్లవ హింసను మతిలేని హింస అని ఎందుకు చెప్పాల్సి వస్తున్నది?

పండా 'భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు' డాక్యుమెంట్‌లో ఉన్న సామాజిక గ్రూపుల పట్ల పార్టీ వైఖరి ఏమిటో స్పష్టంగానే తన ఉత్తరాలలో రాశాడు. కానీ సెక్టేరియన్ సిద్ధాంతాన్ని పుచ్చుకున్న సిసిఎంలు దీన్ని ఆచరించకుండా క్రిస్టియన్లకు వ్యతిరేకంగా ఉంటూ ఆర్ఎస్ఎస్‌ను సమర్థిస్తున్నారని రాశాడు.

క్రిస్టియన్ మత మైనారిటీలలో కొంతమంది ఛాందసవాదులైన పాస్టర్లు (మత పెద్దలు) బూర్జువా, రివిజనిస్టు పాలకవర్గ పార్టీల ప్రాబల్యంలో ఉండడమే కాక, ప్రజల విప్లవ చైతన్యాన్ని పక్కదారి పట్టించి పార్టీని బూటకపు పార్లమెంటరీ పంథాకు కట్టిపడవేసే బూర్జువా రాజకీయాలకు కొమ్ము కాస్తూ ఉన్నారు. ఈ వాస్తవాన్ని పండా చూడ నిరాకరిస్తున్నాడు. అలాగే వర్గ సామరస్యాన్ని పుణికి పుచ్చుకున్న పండా క్రిస్టియన్లలో వర్గ తారతమ్యాలను చూడ నిరాకరిస్తున్నాడు. క్రిస్టియన్ పాస్టర్లలో ప్రజాస్వామిక స్వభావం గల వారందరి పట్ల పాజిటివ్ వైఖరితోనే ఉండాలి. వారి నుండి ఏదైనా సమస్య ముందుకు వచ్చినపుడు మన విమర్శ పాజిటివ్‌గానే ఉండాలి. వీళ్లను అనుసరిస్తున్న ప్రజలు మన విమర్శలను అర్థం చేసుకునేలాగా, స్వీకరించేలాగా ఉండాలి. అలాగే వీళ్ల తప్పుడు రాజకీయాలను పాజిటివ్‌గా విమర్శిస్తూనే మత మైనారిటీలుగా వారి పోరాటాలకు మద్దతు ఇవ్వాలి. వాటిలో చురుగ్గా పాల్గొనడం, తగిన వేదికలను ఏర్పరచి వాటికి నాయకత్వం వహించి, వారినందర్ని వర్గ సంఘాలలో సమీకరించాలి. వర్గ పోరాటాలలో కదలించాలి. ఆర్‌పిసిలో వారి పాత్రని పెంపొందించాలి. పార్టీ, మిలీషియా, పిఎల్‌జిఏలో వారిని భర్తీ చేసుకోవాలి. సరైన క్రియాశీల రాజకీయ, పోరాట, నిర్మాణ కృషి ద్వారానే ఒక క్రమంలో వారిలో విప్లవ చైతన్యం పెంపొందింపజేస్తూ ఈ మైనారిటీ కమ్యూనిటీలోని బూర్జువా, రివిజనిస్టు అవకాశవాద నాయకత్వాన్ని ప్రజలు వ్యతిరేకించేలా చేయాలి.

మత మైనారిటీలుగా క్రిస్టియన్లపై హిందూ మతోన్మాదులు చేసే దాడుల నుండి తమను తాము రక్షించుకోవటానికి మన పార్టీ వారికి పూర్తి అండగా నిలవాలి. మతఛాందసవాదులు

వీరి పట్ల చూపే వివక్షని వ్యతిరేకించాలి. మైనారిటీ హక్కుల పరిరక్షణ విషయంలో వీరిలోని పాస్టర్లు, రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, తదితరులను కూడా మనం వీలైన మేరకు కలుపుకొని రావాలి. ఇలాంటి సమస్యల సందర్భంలో కూడా వీరిలోని కొందరు మనని శత్రు వైఖరితో చూస్తూ మైనారిటీ ప్రజలను మనకు దూరంగా ఉంచడానికి చేసే స్వార్థపూరిత పన్నాగాలను బహిర్గతపరుస్తూనే వీలున్నంత వరకూ వీరిలోని అత్యధికులతో ఐక్యం కావడానికి కృషి చేయాలి. మత మైనారిటీ సమస్యని వర్గ పోరాట సమస్యని రెండింటినీ యాంత్రికంగా ఒకే గాటన కట్టకూడదు. వాటి మధ్య గల సంబంధాన్ని, వ్యత్యాసాన్ని గతితార్కికంగా అర్థం చేసుకోవాలి. అలా చేయగలిగినప్పుడే మైనారిటీ సమస్యతో సరిగా వ్యవహరించగలుగుతాం.

ఈ వర్గ దృక్పథం కొరవడిన కారణంగానే ఫాసిస్టు లక్ష్మణానందను ఖతం చేసిన తర్వాత ఏర్పడిన అనుకూల పరిస్థితిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాం. ఆనాడు ఎంతో మంది మైనారిటీ ప్రజలు మావోయిస్టు పార్టీ అండదండలను కోరుకున్నారు. మావోయిస్టు పార్టీ వైపు ఆకర్షించబడ్డారు. దళాలలోకి 80 మంది సభ్యులు రిక్రూట్ అయ్యారు. కాని సరియైన మావోయిస్టు దృక్పథంతో వారి సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ స్పృహని పథకం ప్రకారం పెంచలేకపోయాం. ఉద్యమ స్థాయికి అనుగుణంగా ఈ ప్రజలను సంఘాలలోకి, పార్టీ సెల్స్‌లోకి విస్తృతంగా చేర్చుకోలేకపోయాం. వారిని పూర్తికాలం కార్యకర్తలుగా, నాయకత్వ శక్తులుగా తీర్చుదిద్దుకోలేకపోయాం. తప్పొప్పులను బేరీజు వేసే సమయంలో ఈ తప్పుల నుండి నేర్చుకోవడానికి పండా సిద్ధంగా లేడు. ఈ సరియైన వైఖరితో ఒక సర్క్యులర్‌ను కూడా విడుదల చేశాం. వాస్తవం ఇది కాగా పార్టీ క్రిస్టియానిటీనే వ్యతిరేకిస్తుందనే పేరుతో యథాతథవాదాన్ని, అదిభౌతికవాద దృక్పథాన్ని, ప్రజల తోక పట్టుకొని పోయే బూర్జువా అవకాశవాద దృక్పథాన్ని పండా తలకెక్కించుకున్నాడు. మైనారిటీ ప్రజలలో వచ్చిన విస్తృత సంబంధాలను ఉద్యమ ప్రయోజనాల కోసం కాక, సంకుచిత దృష్టితో వ్యక్తిగతంగా మాత్రమే వినియోగించుకోవటానికి పరిమితం చేసి (షెల్టర్లకు వగైరాలకు) వారిని సంఘటితం చేసేందుకు దొరికిన అవకాశాన్ని జారవిడిచాడు.

అలాగే శ్రీకాకుళం జిల్లాకు ఆనుకొని ఉన్న ఒడిశాలోని గజపతి జిల్లా దేవగిరి ఏరియాలో భూమి సమస్యపై పోరాటాలు జరిగి ప్రజలు భూములను పంచుకుంటుండగా, కొంతమంది క్రిస్టియన్ ఫాస్టర్లు (మత పెద్దలు) సామ్రాజ్యవాదుల, ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ప్రజలను భూపోరాటాల నుంచి పక్కదారి పట్టించడానికి సంస్కరణవాదంలో ముంచ ప్రయత్నించారు. ఈ ప్రభుత్వ సంస్కరణల కార్యక్రమాన్ని గొప్ప మానవతావాద కార్యక్రమంగా కొంతమంది పాస్టర్లు ప్రచారం చేశారు. వీళ్లు ప్రజల పోరాట చైతన్యాన్ని ఎలా మొద్దుబారుస్తున్నారో వివరిస్తూ రాజకీయంగా బహిర్గతపరచాల్సిన అవసరం వచ్చింది. అలాగే ఫాస్టర్లు రుద్దే మత ఛాందసవాద ప్రభావానికి గురైన మేరకు క్రిస్టియన్ మత మైనారిటీ ప్రజలు విప్లవ వ్యతిరేక కార్యక్రమాలకు

పొల్పడకుండా ఎడ్యుకేషన్ నందించాలి. తద్వారానే అన్ని విప్లవ వర్గాలను, సామాజిక సెక్షన్లను ఐక్యం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించడం సాధ్యం. దీని కోసం శ్రీకాకుళం జిల్లా కమిటీ ఒక కరపత్రాన్ని వేసింది. అందులో బైబిల్‌ను తగులబెట్టమని కానీ, చర్చ్‌లకు వెళ్లవద్దని కానీ, చర్చ్‌లను పడగొట్టమని కానీ రాసింది లేదు. కానీ పండా పార్టీ యెడల ఉన్న వ్యతిరేకతతో అబద్ధాలను సృష్టించి పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాడు. అలాగే పార్టీకి ఉన్న క్రిస్టియన్ వ్యతిరేక వైఖరి కారణంగానే సవర ఆదివాసీ ప్రజలకు పార్టీ దూరమైందనేది కూడా పండా సృష్టించిన అబద్ధమే. నిజానికి శ్రీకాకుళం జిల్లాలో సవర ప్రజానీకంలో పార్టీకి ఆదరణ ఎన్నడూ తగ్గింది లేదు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన శత్రుదాడి, నష్టాల కారణంగానే పార్టీ అక్కడి నుంచి రిట్రీట్ కావాల్సి వచ్చింది. అలాగే బాసధార ప్రాంతంలో ప్రజా రాజ్యాధికార అంగాలను (ఆర్‌పిసిలను) నిర్మాణం చేసే లక్ష్యంతో అక్కడ వర్గ విశ్లేషణ చేయడం (సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితులు)లో భాగంగానే ఆ ప్రాంతంలో క్రిస్టియన్ మత ప్రభావం ఏ స్థాయిలో ఉందో పరిశీలించాలని పార్టీ భావించిందే తప్ప పండా చెప్పినట్లుగా ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పడానికి క్రిస్టియన్ మతం ప్రధాన అడ్డంకిగా మారిందనే పరిశోధన చేయడానికి కాదు.

పండా వర్గాతీత భావాల మీద ఆధారపడి ఆదివాసీ సమాజాన్ని విశ్లేషిస్తున్నాడు. ఆదివాసీ తెగ పెద్దల్లోని ఒక సెక్షన్ భూస్వాములుగా, కాంట్రాక్టర్లుగా, వ్యాపారులుగా, ప్రభుత్వ ఉన్నతాధికారులుగా, దోపిడీ వర్గాల రాజకీయ పార్టీలలో నాయకులుగా మారిన విషయాన్ని చూడ నిరాకరిస్తున్నాడు. అలాగే ఆదివాసీ సంఘాలలో నాయకత్వంలోని కొంతమంది భూస్వామ్య, బూర్జువా, రివిజనిస్టు పాలకవర్గ పార్టీల ప్రాబల్యంలో ఉన్నారు. అంతేకాక వీరిలో కొందరు దోపిడీ వర్గాల కొమ్ముకాస్తూ ప్రజలను విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టించడానికీ, పార్లమెంటరీ రాజకీయాలలోకి ఈడుస్తున్నారు. ఈ కారణంగానే ఆదివాసీల్లో యిలాంటి వారు విశాల ప్రజలతో రాజకీయంగా వైరుధ్యం కలిగి ఉన్నారు. సాంప్రదాయక తెగ పెద్దల నిరంకుశ ఆధిపత్యం, ప్రాథమిక దోపిడీ వివిధ రూపాల్లో ప్రజలపై కొనసాగుతున్నది. వీరు భావజాల పరంగానే కాక దోపిడీ పీడనలకు పాలకవర్గాలకు సాంఘిక పునాదిగా ఉపయోగపడుతున్నారు.

మైదాన ప్రాంతాలలో ఏ రకమైన వర్గ పోలరైజేషన్ జరిగిందో ఆ రకంగా ఆదివాసీ ప్రాంతాలలో జరగకపోయినప్పటికీ పైన చెప్పిన విధంగా ఒక మేరకు వర్గ పోలరైజేషన్ జరిగింది. మా పార్టీ డాక్యుమెంటు 'భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడలు'లో ఈ విషయంలో ఈ విధంగా పేర్కొన్నాం : "ఆదివాసీ ప్రజారాశులపైన ఈ శ్రమకు దూరమైన మధ్యస్థ సెక్షన్ ప్రభావాన్ని నిర్మూలించడాన్ని ఖాయం చేసే సరైన ఎత్తుగడలను అవలంబించవలసి ఉంటుంది. అదే సమయంలో కష్టజీవులైన ఆదివాసీ ప్రజల్లో అంతర్గతంగా బలమైన ఐక్యత సాధించేలా, కష్టజీవులైన

ఆదివాసీల, ఆదివాసులు కాని శ్రమజీవి ప్రజల మధ్య బలమైన ఐక్యతను అభివృద్ధిపరచి కొనసాగించేలా సరైన ఎత్తుగడల్ని అవలంబించాలి.

ఈ ప్రాంతాలు స్థావర ప్రాంతాల ఏర్పాటుకు వీలు కల్పించే వాటి అనుకూల టెర్రయిన్ కారణంగా మిలటరీ దృష్టి కోణం నుంచి వాటికి భారత విప్లవంలో వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉంది. అందువలన పార్టీ ఆదివాసులను – "అడవిపైన హక్కు ఆదివాసులదే", "ఆదివాసీ ప్రాంతాలకు రాజకీయ స్వయం ప్రతిపత్తి" అనే నినాదాలతో సంఘటితం చేయాలి. ఆ భూభాగాలను దోపిడీ లేని ప్రదేశాలుగా అంటే 'ఎర్ర భూభాగాలు'గా పరివర్తన చెందించాలి. 'విడిపోవద్దు. కలిసికట్టుగా ఉండండి', 'నిజమైన శత్రువులకు వ్యతిరేకంగా నిజమైన స్నేహితుల్ని ఐక్యపరచండి', 'నీరు, అడవి మొదలైన వాటితో సహా అన్ని వనరులపై హక్కు', 'తమ సొంత సంస్కృతినీ, అభివృద్ధినీ పరిరక్షించుకునే హక్కు' మొదలైన నినాదాలతో సంఘటితపరచాలి. వారిని సామ్రాజ్యవాదం, దళారీ బ్యూరాక్రిటిక్ బూర్జువా, భూస్వామ్య విధానాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పీడనకు వ్యతిరేకంగా సమీకరించడం కోసమై వారిలో కృషి సాగించడానికి ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించుకోవాలి." (పేజీలు 121, 122ల నుండి)

ఆదివాసీలు మన విప్లవోద్యమంలో భాగస్వామ్య పక్షాలేననేది మనకు తెలిసిందే. అయితే తెగ పెద్దలందరినీ ఒక దోపిడీ వర్గంగా మన పార్టీ ఎన్నడూ చెప్పలేదు. కానీ, పండా ఆదివాసుల్లో వర్గాలు లేవు అన్నాడు. విప్లవ సంఘాలలోకి, పార్టీ నిర్మాణాల్లోకి, వర్గ రీత్యా మధ్యతరగతి రైతాంగం అనే పేరుతో తెగ పెద్దలను నాయకత్వంలోకి తీసుకోవాలనే వాదాన్ని ముందుకు తెచ్చాడు. పీడిత వర్గ ప్రజలపై ఆధారపడడం కాకుండా తెగ పెద్దలనే సర్వస్వంగా భావిస్తున్నాడు. ఆదివాసీ సమాజంలో ఉన్న మంచి చెడులను విశ్లేషించి, చెడును తొలగిస్తూ, మంచిని పెంపొందిస్తూ వారిని విప్లవీకరించే పురోగామి భావాలను పండా ఏ కోశాన జీర్ణించుకోలేకపోతున్నాడు. పైగా పార్టీ అనుసరిస్తున్న సరైన పాలసీని వక్రీకరించి తెగ పెద్దలను టార్గెట్ చేస్తున్నారని పార్టీ పైన దాడి చేస్తున్నాడు.

ఆదివాసీ సమస్యపై మన పార్టీ కార్యక్రమం చాలా స్పష్టంగా సరైన విధానాన్ని అందించింది. ఈ సమస్యకు గల ప్రాధాన్యతను గమనంలో ఉంచుకొని భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు అనే డాక్యుమెంట్‌తో పాటు రాజకీయ తీర్మానం డాక్యుమెంట్‌లో సరైన ఎత్తుగడలు కూడా రూపొందించుకున్నాం. పండా లేవనెత్తుతున్న కుతర్కాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ మరికొంత వివరణ ఇస్తున్నాం. ఆదివాసీలపై ఆదివాసేతరులు, దోపిడి రాజ్యం చేసే దాడుల నుండి తమను తాము రక్షించుకోవటానికి మన పార్టీ వారికి పూర్తి అండగా నిలవాలి. ఆదివాసేతరులు వీరి పట్ల చూపే వివక్షని వ్యతిరేకించాలి. ఆదివాసీ హక్కుల పరిరక్షణ విషయంలో వీరిలోని తెగ పెద్దలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, తదితరులను కూడా మనం వీలైన

మేరకు కలుపుకొని రావాలి. ఇలాంటి సమస్యల సందర్భంలో కూడా వీరిలోని కొందరు మనని శత్రు వైఖరితో చూస్తూ ఈ ప్రజలను మనకు దూరంగా ఉంచడానికి చేసే స్వార్థపూరిత పన్నాగాలను బహిర్గతపరుస్తూనే వీలున్నంత వరకూ వీరిలోని అత్యధికులతో ఐక్యం కావడానికి కృషి చేయాలి. ఆదివాసీ సమస్యని వర్గ పోరాట సమస్యని రెండింటినీ యాంత్రికంగా ఒకే గాటన కట్టకూడదు. వాటి మధ్య గల విడదీయరాని సంబంధాన్ని, వ్యత్యాసాన్ని గతితార్కికంగా అర్థం చేసుకోవాలి. అలా చేయగలిగినప్పుడే ఆదివాసీ సమస్యని సరిగా అర్థం చేసుకొని దాని పట్ల సరిగా వ్యవహరించగలుగుతాం.

దేశంలోని వివిధ ఆదివాసీ ప్రాంతాలలో నిలకడైన, స్థిరమైన విప్లవోద్యమాన్ని నిర్మించే క్రమంలో వచ్చిన  అనుభవాల సంశ్లేషణగా మనం వ్యూహం-ఎత్తుగడలలో రాసుకున్న విషయాన్ని పండా ఉద్దేశ్యపూర్వకంగానే చూడ నిరాకరిస్తూ పార్టీకి అతీతుడిగా తన మేధస్సుకు తిరుగులేదనే అహంభావాన్ని పెంచుకున్నాడు. భారతదేశంలో ఆదివాసీ ప్రాంతాలకు సాధారణంగా వర్తించే సూత్రాలపైన ఆధారపడి ఆయా ప్రాంతాలలో ఉన్న నిర్దిష్ట సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, భౌగోళిక పరిస్థితులను పరిశోధించి నిర్దిష్టంగా వర్గ విశ్లేషణ, తగిన పోరాట, నిర్మాణ రూపాలను రూపొందించుకొని వర్గ పోరాటాన్ని, ప్రజా యుద్ధాన్ని పురోగమింపజేయాలని పార్టీ చెబుతున్నది. కానీ ఆవగింజంత కూడా చిత్తశుద్ధి లేకపోవడం వల్ల పండా ఒడిశాలో సామాజిక పరిశోధన చేయకుండా వదిలేశాడు. బాసధారలో ఆయన కంటితుడుపుగా చేసిన వర్గ పరిశోధన తెగ పెద్దల తోక పట్టుకు పోవడానికే ఉపయోగపడింది. సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాల దోపిడీ అణచివేత వ్యవస్థకు (అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థకు) వ్యతిరేకంగా ఒక ప్రత్యామ్నాయ నూతన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం పోరాడుతున్న మన పార్టీ తన విధానాలను అమలు చేసేటపుడు శత్రువు పట్ల ఎంత నిర్దయగా ఉంటుందో, ప్రజల (విప్లవ వర్గాల) పట్ల అంత ప్రజాస్వామికంగా ఉంటుంది. ప్రజాస్వామ్యం పునాదిగానే విప్లవ ప్రజా సంఘాలు, ఆర్‌పిసిలు నిర్మించబడుతున్నాయి, పనిచేస్తున్నాయి, లక్ష్య సాధనకు పోరాడుతున్నాయి. మెజారిటీ ప్రజలు ఆమోదించే, ఆచరించే పనివిధానాన్ని, పాలసీలను చేపడుతున్నది. వర్గ దృక్పథంతో కూడిన ప్రజాస్వామికమే నిజమైన ప్రజాస్వామికం అనే దానికి పండా తిలోదకాలిచ్చి బూర్జువా ఉదారవాదాన్ని తలకెక్కించుకున్నాడు.

వర్గ సంఘాలలో వ్యవసాయ కూలీ, పేద రైతాంగాన్ని నాయకత్వంగా అభివృద్ధి చేయడానికి బదులుగా ఆదివాసీ ప్రాంతాల అటానమీ పేరుతో వర్గస్పృహతో నిమిత్తం లేకుండా ప్రజల పేరుతో తెగ పెద్దలందరినీ నాయకత్వ కమిటీలోకి ఎన్నుకోవడం ద్వారా ఆదివాసీ సమాజంపై తెగ పెద్దల ఆధిపత్యాన్ని నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆర్‌పిసిలకు ప్రత్యామ్నాయంగా అటానమీని పోటీ పెడుతున్నాడు. ఆయన ఉద్దేశంలో బూర్జువా రాజ్యాంగం చెప్పిన అటానమీనే

సర్వస్వంగా భావిస్తున్నాడు.  అతడు అక్కడి నుండి ఒక్క అడుగు ముందుకు వేయడానికి కూడా సిద్ధంగా లేడు. ఇక అతనికి నూతన ప్రజాస్వామ్యం ఏమి జీర్ణమవుతుంది? స్థావర ప్రాంతాల ఏర్పాటులో భాగంగా ప్రాథమికంగా నిర్మాణమవుతున్న ఆర్‌పిసిలను, నూతన ప్రజాస్వామిక కార్యక్రమంతో కూడిన వాటి విధాన పత్రాన్ని వ్యతిరేకిస్తున్నాడు. ఆర్‌పిసిలకు (విప్లవ ప్రజా ప్రభుత్వానికి) ఆదివాసీ ప్రాంతాల పట్ల ప్రత్యేక విధానం ఏమీ లేదని, అది ఆదివాసీ అటానమీ కాదని లేదా అది కనీసం ఆదివాసీల సాంప్రాదాయాలను పాక్షికంగా కూడా అమలు చేయదని, వ్యవసాయం, పరిశ్రమలు, వైద్యం, విద్యా విధాన పాలసీలు లేకుండా ఆదివాసీ స్వయంపాలన ఎట్లా సాధ్యమని బుకాయిస్తూ ప్రశ్నిస్తున్నాడు. అసలు పండా సిసి రూపొందించిన ఆర్‌పిసి విధాన పత్రాన్ని, వ్యూహం–ఎత్తుగడలలో రూపొందించిన పాలసీలను లోతుగా అధ్యయనం చేయకపోవడమే కాక పురోగామి ఉద్యమాల (డికె, బిజె ఉద్యమాల) అనుభవాల నుండి నేర్చుకోవడానికి సిద్ధంగా లేడు. అతను దుర్బుద్ధితో డికె, బిజె ఉద్యమాలను తప్పుడు పద్ధతుల్లో చిత్రీకరిస్తున్నాడు. మా పార్టీ ఆదివాసీల హక్కుల విషయంలో ఆర్‌పిసి విధాన పత్రంలోని 17వ పాయింట్‌లో (7వ పేజీ – ఇంగ్లీషు ప్రతి) ఈ కింది విధంగా స్పష్టంగా రాసింది : "ఆదివాసీ సమాజాల సమగ్ర అభివృద్ధికై స్వయం పాలనకు (ఆర్‌పిసి) గ్యారంటీనిస్తుంది. అడవిపై అన్ని అధికారాలను ప్రజలకే కల్పిస్తుంది. దళారీ బడా బూర్జువాలు, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ద్వారా ఈ ప్రాంతాల ప్రకృతి వనరులను కొల్లగొట్టడాన్ని అడ్డుకుంటుంది. వారి భాషా, సంస్కృతుల వికాసానికి తోడ్పడుతుంది. అందుకు అనుగుణమైన విధానాలను రూపొందిస్తుంది." ఈ విధానాన్ని మా పార్టీ ఖచ్చితంగా అమలు చేయడానికి చేసిన కృషి ఫలితంగానే భారతదేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో మా పార్టీ బలమైన పునాది ఏర్పర్చుకోగలిగింది. ఈ విషయాన్ని మరుగుపర్చేందుకు పండా విఫల ప్రయత్నం చేస్తున్నాడు.

కమ్యూనిస్టుల స్వభావం గురించి కామ్రేడ్ లెనిన్ చెప్పిన ఈ కింది వ్యాకాలు పండాకు నూటికి నూరు పాళ్లు వర్తిస్తాయి : "కమ్యూనిస్టు ఎప్పుడూ నాకు తెలిసింది స్వల్పమనీ, నాకు తెలిస్తే మరింత నేర్చుకోవడానికి పాటుపడతాను; కానీ ఒక మనిషి తాను కమ్యూనిస్టుననీ, యేదీ సమగ్రంగా తెలుసుకోవలసిన అవసరం తనకు లేదనీ అంటే అతను కమ్యూనిస్టు ఎప్పటికీ కాలేడు." కానీ పండా శృతి మించిన అహంతో విలువైన దేశ, విదేశీ విప్లవానుభవాల నుండి ఆవగింజంత కూడా నేర్చుకోవడానికి సిద్ధం కాలేదు. అతని పతనానికి ఇదొక కారణమే.

ఒడిశా ఎస్‌ఓసి సభ్యుడిగా, నాయకుడిగా పండా ఏనాడూ కమిటీ సభ్యులతో సయోధ్య నెరిపింది లేదు. చివరికి ఉద్యమాన్ని సమీక్షించుకొని రాష్ట్ర రాజకీయ నిర్మాణ సమీక్ష రాసుకునే ప్రక్రియకు అనేక ఆటంకాలు కల్పించి, అసమ్మతులు తెలుపుతూ దానిని ఒక కొలిక్కి రానీయకుండా చేశాడు. ఇట్లా ఏ పనిని సరిగ్గా జరగనీయకుండా చేస్తూ, కమిటీలో కార్యదర్శితో పాటు ఎవరినీ

నెగులనీయకుండా చేస్తూ, కమిటీ ఫంక్షనింగ్‌కు, ఉద్యమ పురోగమనానికి తీవ్ర ఆటంకంగా మారినాడు. ఆ విధంగా ఎస్ఓసి రాష్ట్ర కమిటీగా అభివృద్ధి కాకపోవడానికి పండాయే ప్రధాన కారకడయ్యాడు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎవరో వ్యక్తులు (తన ఉద్దేశంలో ఒడిశా ఇన్‌చార్జి సిసిఎంలు) దీనికి కారణమంటూ నిందలు మోపాడు.

మావోయిస్టు పార్టీలో నాయకత్వ అణచివేతకు గురికాబడతారనీ, విమర్శల్ని నాయకత్వం ఎప్పుడూ స్వీకరించదనీ, లోపాలను గుర్తించదనీ, సమీక్షలు ఉండవనీ పండా వాగుతున్న అవాకులూ, చవాకులూ అన్నీ నిజానికి సరిగ్గా సంపూర్ణంగా తనకి వర్తించేవే. ఇది కట్టుకథ, పుక్కిటి పురాణం అనేదాన్ని రుజువు చేయడానికి పండా జత చేసిన బాసధార సమీక్షలోనే ఉన్న విషయాలు సరిపోతాయి. పార్టీలో ఎంత లోతుగా సమీక్షలు ఉంటాయో గుర్తించడానికి పండా మొదట నుండీ అవలంబించిన విధానాన్ని క్రోడీకరించి చెప్పాలంటే ఒడిశా అనే సామ్రాజ్యంలో తానొక రాజు, ఈ రాజ్యంలో తానే సర్వస్వం, అది తన ఇష్టారాజ్యం, అక్కడ తనను ఎవరూ ప్రశ్నించకూడదు, తన స్వార్థపూరిత కార్యక్రమాలకు ఎవరూ అడ్డు చెప్పకూడదు. నేడది సాగని స్థితిగా ముందుకు రావడంతో వేరు కుంపటి, ఒంటరి కాపురం అవసరం అయ్యాయి.

మల్కన్‌గిరి కలెక్టర్ వినీల్ క్రిష్ణను ఏఓబి కామ్రేడ్స్ బందీగా పట్టుకున్నప్పుడు విడుదల కోసం ప్రతిపాదించిన వ్యక్తుల జాబితాను (డిమాండ్స్ కాగితం) స్వయంగా పండా చేతికి ఇచ్చినప్పటికీ అందులో తపన్ మిశ్రా, గణనాథ్ పాత్రోల పేర్లు ఉన్న విషయం తెలినప్పటికీ, ఆనాడు పార్టీ కమిటీలో చర్చ జరిగి, నిర్ణయించిన ప్రాతిపదిక ప్రకారం సిసి కామ్రేడ్స్‌తో పాటు కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లా జైళ్లలో ఉన్నవారినే విడుదల చేయాలని కోరారు. పండాకు ఉన్న అక్కసు వెనక గల కారణం ఏంటంటే తన భార్య మిల్లీ పండా పేరును జాబితాలో చేర్చలేదనేదే. వాస్తవానికి వినీల్ క్రిష్ణను, జిన్నా హికాకాను బంధించిన రెండు సందర్భాలలోనూ విడుదలైన వందల మందిలో అత్యధికులు ఒడిశా కార్యకర్తలు, సాధారణ ప్రజలే ఉన్నారు. కానీ ఇంతగా ఒడిశా పేరు చెప్పుకుని పబ్బం గడుపుకుంటున్న పండా ఇటలీ పర్యాటకుల్ని పట్టుకొన్నపుడు తన భార్య మిల్లీ పండాను మినహాయించి ఒక్కరంటే ఒక్కర్ని కూడా, ఆఖరికి అంతగా చర్చ జరిగిన ఆరతి మాజీని కూడా విడుదల చేయకుండానే అవకాశవాదంతో ప్రభుత్వంతో రాజీపడ్డాడు. దీన్ని గమనించిన వారికి పండాకు ఒడిశా మీద ఉన్న ప్రేమ ఏమిటో సులువుగానే అర్థం అవుతుంది. ఆఖరికి బిజెడి నుంచి చీలి ఒడిశా జనమోర్చా ఏర్పర్చిన నేత ప్యారీ మోహన్‌తో మంతనాలు జరుపుతూ బూర్జువా రాజకీయాల్లోకి దిగజారిపోతున్నాడు.

ఆఖరుగా చెప్పాల్సి వస్తే పండాలోని సెక్టేరియనిజం, బ్యూరాక్రసీ, అతిప్రజాస్వామ్యం, క్రమశిక్షణా రాహిత్యం, కెరీరిజం, కీర్తికండూతి ధోరణులు సంఘటితపడుతున్న ఒడిశా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీకి, పార్టీకి, ఉద్యమానికి, తీవ్రంగా నష్టం కలిగించాయి. మరోవైపు గ్రీన్

హంట్ సైనిక దాడి తీవ్రతరమైన పరిస్థితులలో పండా చేసిన ద్రోహం మొత్తం ఉద్యమంపై నకారాత్మక ప్రభావాన్ని వేసింది. వీటన్నింటికీ మూలం వ్యక్తిని కేంద్రంగా నిలిపే అతని శృతి మించిన వ్యక్తివాదంలో ఉంది. వీటితో పాటు విప్లవోద్యమంపై సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో భారత పాలకవర్గాలు కొనసాగిస్తూ వస్తున్న విప్లవ ప్రతీఘాతుక యుద్ధంలో 2009 మధ్య నుండి ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరిట గణనీయమైన మార్పు వచ్చింది. అప్పటి నుండి ఉద్యమంపై దేశవ్యాప్త, బహుముఖ, భారీ సైనిక దాడి కొనసాగుతున్న నేపథ్యంలోనే పండా దిగజారుడుతనాన్నీ, విద్రోహాన్ని చూడాల్సి ఉంటుంది. ఇలాంటి విద్రోహిని పార్టీ నుంచి బహిష్కరించకుండా ఉండగలమా? పండా ముందుకు తెచ్చిన తప్పుడు మితవాద అవకాశవాద పంథాను ఓడించడం ద్వారానే, అతన్ని పార్టీ నుండి బహిష్కరించడం ద్వారానే ఒడిశా రాష్ట్రంలో సరియైన పంథా చుట్టూతా పార్టీలో భావసమైక్యతను పునరుద్ధరించడం, వర్గయుద్ధం చుట్టూతా ప్రజలను పునస్సంఘటితం చేయడం సాధ్యమవుతుంది.

క్రూరమైన గ్రీన్ హంట్ బహుముఖ దాడిలో పార్టీకి దేశవ్యాప్తంగా తీవ్రమైన నష్టాలు జరిగాయి. ఒడిశాలో వర్గ పోరాటం ఇప్పటికీ బలహీనంగానే ఉన్నప్పటికీ అది కూడా ఈ దాడికి తీవ్రంగానే గురయింది. 2010 చివరి నుండి అది తీవ్రమైన నష్టాల్ని చవిచూసింది. ఈ దాడి ఇంకా తీవ్రతరం కానుంది. భారతదేశంలోని జల్–జంగల్–జమీన్‌ను, ఖనిజ సంపదను, ఎల్‌పిజి విధానాలతో దోచుకోవడానికి తమకు అడ్డం వచ్చే ప్రతి సంస్థనూ, ప్రజలను అణచివేయడానికి ప్రధాన కారణం బహుళ జాతి, దేశ దళారీ కార్పొరేట్ ప్రయోజనాలే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ఎంత తీవ్రతరమైతే దాని నుండి బయటపడ్డానికి విప్లవ పార్టీపై, దాని నాయకత్వంపై పీడిత తాడిత ప్రజలపై కొనసాగించే దాడిని వారు అంత తీవ్రంగా చేస్తారు. విప్లవ పార్టీలోని నాయకులెవరికైనా గానీ ఇటువంటి నేపథ్యంలో విప్లవోద్యమాన్ని నడపడం అంటే కత్తి మీద సామే.

నిజమైన పార్టీ నాయకులెవరైనా దేశంలోనూ, ప్రపంచంలోనూ నెలకొన్న అద్భుత విప్లవ పరిస్థితులను ఉపయోగించుకొని ప్రజలను రాజకీయంగా సంసిద్ధం చేస్తూ ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తారు. అందుకు విప్లవ సిద్ధాంతం పట్ల నిబద్ధత, గట్టి పట్టుదల, సాహసోపేతంగా నిర్ణయాలు తీసుకోవడం, పార్టీని, ప్రజాసైన్యాన్ని, ప్రజలను ఏకతాటిపై కదిలించడం, త్యాగనిరతి అవసరమవుతాయి. విప్లవ అవసరాలకూ, కర్తవ్యాలకూ అనుగుణంగా తనను తాను మలుచుకోవడానికి, పార్టీని మలచడానికీ ఉక్కు లాంటి సంకల్పం అవసరం అవుతుంది. ఇటువంటి లక్షణాలు ప్రదర్శించలేనివారు విప్లవానికి నాయకత్వాన్ని అందించడంలో విఫలమవుతారు లేదా అశక్తులవుతారు. అలాంటి వారిలో కొందరు యుద్ధరంగంలో

పిరికిపందల్లాగ పారిపోతారు లేదా శత్రు పంచన చేరతారు. దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈ అవకాశవాదులు, విప్లవ ద్రోహులు పాలకవర్గాల కొమ్ము కాస్తూ పార్టీపై, నాయకత్వంపై అన్ని రకాల ఆరోపణల్ని చేస్తారు. భారతదేశ పార్టీ చరిత్రోనే కాకుండా వివిధ దేశాల విప్లవాల్లో గతంలోనూ ఇటువంటి రెనగేడ్లు ఉండినారు. వీరిని చరిత్ర పెంటకుప్ప మీదికి విసిరేసింది. అదే గతి రెనగేడ్ పండాకు పట్టక తప్పదు.

తేది : 10-7-2013

విప్లవాభినందనలతో,

**కేంద్రకమిటీ**

**సి.పి.ఐ. (మావోయిస్టు)**